ఈనాడు
కర్నూలు
సోమవారం సెప్టెంబరు 30, 2024

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అన్నారు. నగరంలోని కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకల్లో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలన్నారు. అనంతరం గోడపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, గౌరవాధ్యక్షుడు కమలాకర్, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గొంతు తడవాలంటే నిరీక్షించాల్సిందే

మండల పరిధిలోని గార్లదిన్నెలో గత కొన్ని రోజులుగా జనం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వెయ్యికిపైగా జనాభా ఉంది. అల్వాల నీటి పథకం ద్వారా రెండు మూడు రోజులకో సారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్థులు తాగునీటి కోసం కుళాయిల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. తాగునీరు ప్రతిరోజూ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని జనం విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

హద్దులు దాటిన వెంచర్లు



“ ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టణ ప్రాంతాల్లో అనుమతులు లేని స్థిరాస్తి వెంచర్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. నిబంధనలు పాటించకుండా అక్రమ దారులు వేశారు.. హద్దులు దాటి రాళ్లు పాతారు.. కొలతలతో తికమక పెట్టారు. బ్రోచర్లతో పేదలను మభ్యపెట్టారు.. నిజాలు దాచిపెట్టి ప్రజలను దోచేశారు.. ఇష్టానుసారంగా లేఅవుట్లు వేసి రూ.కోట్లు కొల్లగొట్టారు.”

“ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో 300 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల చొప్పున రుసుము లెక్కించినా.. వెయ్యి ఎకరాలకు రూ.50 కోట్ల చొప్పున రూ.100 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

వైకాపా పాలనలో నాయకగణం వెంచర్ల పేరుతో అనుమతి లేకుండా ప్లాట్లు వేసి రూ.కోట్లు గడించింది. అన్నీ తెలిసినా.. అధికారులు వెంచర్ల జోలికి వెళ్లలేదు. చిన్న స్థాయి కార్యకర్త మొదలు ప్రజాప్రతినిధుల వరకు అందరికీ వాటాలు ఉండటమే ప్రధాన కారణం. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని రూ.కోట్లు గడించారు. కొనుగోలుదారులు అసౌకర్యాలతో సతమతమవుతూ లబోదిబోమంటున్నారు.

- న్యూస్‌టుడే ఆదోని, నంద్యాల పురపాలకం, కర్నూలు నగరపాలక సంస్థ,

ఇదీ లెక్క

ఎకరా లేఅవుట్‌లో నిబంధనల ప్రకారం మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు వేస్తే 15 ప్లాట్లు ఏర్పాటు చేయాలి. అదే నాన్ లేఅవుట్లలో 25 ప్లాట్లు వేస్తారు. అంటే ఎకరాకు సుమారు పది ప్లాట్ల ద్వారా ఆదాయం సమకూరుతుంది. ప్లాటులో సెంటు స్థలం రూ.10 లక్షలు అనుకున్నా.. మూడు సెంట్లకు రూ.30 లక్షలు, అదే పది ప్లాట్ల సంఖ్య విలువ రూ.3 కోట్లు మిగులుబాటు అవుతుందన్న మాట.



నిబంధనలు గాలికి..

నిర్వాహకులు నిబంధనలేవీ పాటించకుండా కొనుగోలుదారులకు ప్లాట్లు అంటగడుతున్నారు. అనధికార లేఅవుట్లలో రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. పురపాలక సంఘాలకు రుసుములు చెల్లించడం లేదు. ప్రస్తుతం శివారు ప్రాంతాలు, పట్టణాలు, నగరాలకు ఆనుకుని ఉండే సరిహద్దుల వెంట వెంచర్లు వెలుస్తున్నాయి. ఎకరా రూ.లక్షల్లో కొనుగోలు చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. సెంటు ప్రస్తుతం రూ.10-15 లక్షలు పలుకుతోంది. ఇటాంటి వాటిల్లో నిబంధనలు పాటించకపోవడంతో రహదారులు విశాలంగా ఉండవు. పార్కులు, ఓపెన్ స్థలాలు కనిపించవు. ముఖ్యంగా పురపాలక సంఘాల నుంచి వీటికి ఎలాంటి మౌలిక సదుపాయాలు సమకూరవు. ఇది తెలియక చాలామంది తక్కువ ధరకు స్థలాలు వస్తున్నాయని కొనుగోలు చేసి నష్టపోతున్నారు.

ఇవి తప్పనిసరి

ప్లాట్లుగా వేయాలంటే ముందుగా పొలానికి రెవెన్యూ ల్యాండ్ కన్వర్షన్ ధ్రువీకరణ పత్రం పొందాలి. ఇందుకు ఐదు శాతం మార్కెట్ విలువ చెల్లించాలి. జీవో 275ను అనుసరిస్తూ పది శాతం ఓపెన్ స్థలం, 2 శాతం ఎమినిటీస్, 2 శాతం యుటిలిటీ ఛార్జీలు చెల్లించాలి. 40 అడుగుల రహదారులు ఏర్పాటు చేయాలి. ఎకరాకు రూ.5-6 లక్షల రుసుము చెల్లించి సరైన పత్రాలతో పురపాలక సంఘానికి అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేయాలి. ఆ తర్వాత అర్బన్ డీటీసీపీకి వెళ్తుంది. అక్కడి నుంచి టీఎల్‌పీ ఆమోదం పొందాల్సి ఉంటుంది. రెండేళ్ల లోపు రహదారులు, కాలువలు, నీటి గొట్టాలు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. ఓపెన్ స్థలాన్ని పురపాలక సంఘానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలి.

శిరస్త్రాణం ధరించడం సామాజిక బాధ్యత

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు సూచించారు. కర్నూలులోని న్యాయసేవాసదన్‌లో ఆదివారం శిరస్త్రాణాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్ హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ శిరస్త్రాణం ధరించడం నిబంధన అనికాక సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. అంతకుముందు అదనపు న్యాయమూర్తి ప్రతిభాదేవి, పాండురంగారెడ్డి, భూపాల్‌రెడ్డితో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్మన్ కిశోర్‌కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి న్యాయమూర్తిని కలిశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం అందజేస్తున్న జస్టిస్ మన్మథరావు

సీఎం పర్యటన సజావుగా సాగేలా ఏర్పాట్లు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పుచ్చకాయలమడలో అక్టోబరు 1న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. ఆయన ఆదివారం సాయంత్రం గ్రామంలో పర్యటించారు. పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. జేసీ నవ్య, ఎస్పీ బిందుమాధవ్, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

○ రూ.138 కోట్లతో చేపట్టే సీసీ రహదారులు, ఉన్నత పాఠశాల ప్రహరీ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని అధికారులు తెలిపారు. శిలాఫలకం పనులు వేగవంతం చేసేలా స్థానిక అధికారులతో తెదేపా సీనియర్ నేత సాంబశివారెడ్డి తదితరులు చర్చించారు.

హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

తప్పినా.. తప్పించరు

- శాఖాపరమైన పరీక్షల్లో పలువురి అనుత్తీర్ణత
- అయినప్పటికీ ఎస్‌ఏలుగా కొనసాగింపు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు (గ్రేడ్–1 వీఆర్వో)కు రెండేళ్ల కిందట పదోన్నతులు కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ కాలపరిమితిలో నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలి. తప్పితే పదోన్నతులు పొందినవారిని తిరిగి వీఆర్వోలుగా వెనక్కు పంపాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో పలువురు తప్పినా ఇప్పటివరకు నిబంధనలు వర్తింపజేయలేదు.

- న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

అంతా గోప్యమే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39 మంది వీఆర్వోలకు 2022, మార్చి 5న సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించారు. అందులో 37 మంది పదోన్నతులు తీసుకోగా.. మరో ఇద్దరు తమకు వద్దంటూ వీఆర్వోలుగానే ఉండిపోయారు. 2024, మార్చి 5వ తేదీ నాటికి వారికి రెండేళ్ల కాలపరిమితి గడువు ముగిసింది. నిబంధనల ప్రకారం శాఖాపరమైన పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాల్సి ఉంది. కానీ ఆ వివరాలు బయటపెట్టలేదు.

పాసైంది 11 మందే..

గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి సీనియర్ సహాయకులుగా పదోన్నతులు పొందిన 37 మందిలో కర్నూలు జిల్లాలో ఆరుగురు, నంద్యాల జిల్లాలో ఐదుగురు కలిపి కేవలం 11 మంది మాత్రమే రెవెన్యూ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 26 మంది తప్పారు. మరోవైపు ఈ ఏడాది మార్చి నాటికి రెండేళ్ల పదోన్నతి గడువు ముగిసింది. ఉత్తీర్ణత సాధించని సీనియర్ అసిస్టెంట్ల విషయంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారి వివరాలు బయటకు పొక్కనీయకుండా కొందరు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

ముడుపులు ఇచ్చుకుంటాం

తమను సీనియర్ అసిస్టెంట్లుగా మరో రెండేళ్లపాటు కొనసాగించాలని.. లేకుంటే డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పాస్ చేయిస్తే ఎంతైనా ముడుపులు ఇచ్చుకుంటామంటూ కొందరు రాష్ట్రస్థాయిలో బేరసారాలు చేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులను సైతం డబ్బుతో కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. రివర్షన్లతో రావడం ఇష్టంలేక కొందరు అందులోనే కొనసాగేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

● డిపార్ట్‌మెంటల్ పరీక్షలు తప్పినవారికి సంబంధించి రాష్ట్రంలోని ఐదారు జిల్లాల్లో వీఆర్వోలుగా రివర్షన్లు ఇచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పరీక్షల్లో తప్పినవారికి రివర్షన్లు ఇచ్చి కొత్తగా పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తే అర్హులైన వారికి పదోన్నతులు వచ్చే అవకాశముందంటూ పలువురు వీఆర్వోలు ఇటీవల డీఆర్వో, కలెక్టరేట్ ఏవోలకు వినతిపత్రాలు అందించారు.

అత్యవసరం.. ఆలస్యం

① చికిత్స చేయలేమంటూ..

108 వాహనంలో ప్రసవించిన ఈమె పేరు రేష్మ. ఈమెది గడివేముల మండలం బిలకలగూడూరు. ఈ ఏడాది ఏప్రిల్ 24న ప్రసవం కోసం గడివేముల పీహెచ్‌సీకి వచ్చారు. పీహెచ్‌సీ సిబ్బంది ఇక్కడ కాన్పు చేయడం సాధ్యం కాదంటూ మిడుతూరుకు రెఫర్ చేశారు. 108లో తీసుకెళుతుండగా తలముడిపి సమీపంలో ప్రసవమైంది. వైద్య సిబ్బంది కొంత ప్రయత్నం చేసి ఉంటే గడివేముల పీహెచ్‌సీలోనే ఆమెకు కాన్పు అయ్యేది.

రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారిని.. అనారోగ్యంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని అత్యవసర వైద్యం అందించేందుకుగాను సమీప ఆసుపత్రులకు తరలించే ఉద్దేశంతో 108 వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్క ఫోన్ కాల్‌తో వచ్చి ప్రాణాలు నిలిపే ‘సంజీవని వాహనాలు’గా పేరుగాంచిన వీటి సేవలు దుర్వినియోగమవుతున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో వైద్యం చేయకుండానే రెఫరల్ పేరుతో 108లో ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రులకు పంపేస్తున్నారు. కొన్ని వైద్యాలయాల్లో రోగులు, గర్భిణులను కనీసం పరీక్షించకుండానే తరలిస్తున్నారు. ఫలితంగా ఈ వాహనాలు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండటం లేదు.

– న్యూస్‌టుడే, పాణ్యం, ఆళ్లగడ్డ



జిల్లా	వాహనాలు	కేసులు
కర్నూలు	27	980
నంద్యాల	31	1,330

② సాధారణ కాన్పు కాదన్నారు..

ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్లకు చెందిన గర్భిణి కీర్తికి 14వ తేదీ వేకువజామున పురిటి నొప్పులు రావడంతో ఆళ్లగడ్డ సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. విధుల్లో ఉన్న నర్సులు ఆమెను పరీక్షించారు. ఉదయం 11 గంటలకు వచ్చిన వైద్యులు కీర్తికి సాధారణ కాన్పు కష్టమని.. శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నించాలని బంధువులు కోరినా తమవల్ల కాదంటూ 108లో నంద్యాలకు పంపారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మధ్యాహ్నం 2 గంటలకు కీర్తి సాధారణ కాన్పులోనే మగపిల్లవాడికి జన్మనిచ్చారు. ఆళ్లగడ్డ వైద్యులు కొంత ప్రయత్నించి ఉంటే తన కోడలికి స్థానికంగానే సాధారణ కాన్పు అయ్యేదని ఆమె మామ ఆవేదన వ్యక్తం చేశారు.

○ ఉమ్మడి జిల్లాలో 58 వరకు 108 వాహనాలు ఉన్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో చేరిన వారికి మెరుగైన వైద్యం పేరుతో పెద్దాసుపత్రులకు తీసుకెళ్లేందుకే ఎక్కువగా ఈ వాహనాలు ఉపయోగిస్తున్నారు. ప్రతి నెలా 2,300 రెఫరల్ కేసులకు వీటిని వినియోగిస్తున్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్యం అందిస్తే రోగులను దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉండదు. 108 వాహన సేవల దుర్వినియోగం అరికట్టవచ్చు. అత్యవసర సేవలకు వీటిని వినియోగించడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించొచ్చు.

ఏటా 25 వేలకుపైగా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందకపోవడంతో 108 వాహనాలపై రెఫరల్ కేసుల భారం పెరుగుతోంది. ఏటా 25 వేలకుపైగా రెఫరల్ కేసులు ఉంటుండటం గమనార్హం. గత ఆగస్టు నెలలో ఆళ్లగడ్డ సీహెచ్‌సీ నుంచి 66 రెఫరల్ కేసులు నంద్యాల ఆస్పత్రికి వెళ్లాయి. నందికొట్కూరు సీహెచ్‌సీ నుంచి అదే సంఖ్యలో రోగులను పంపారు. వెల్దుర్తి ప్రాంతం నుంచి 80 కేసులను కర్నూలుకు రెఫర్ చేశారు. కోడుమూరు నుంచి 70 మందిని కర్నూలుకు 108లో తీసుకెళ్లారు. కొన్ని సీహెచ్‌సీల్లో ప్రథమ చికిత్స కూడా చేయకుండానే రెఫర్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

ఎర్రపండు.. ధర మెండు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ టమాటా మార్కెట్‌లో ధరలు మరింత ఎగబాకాయి. ఐదు రోజులుగా క్వింటా టమాటా గరిష్ఠ ధర రూ.3 వేలకు పైగానే పలికిన ధర ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేలం పాటలో గరిష్ఠంగా రూ.4,500కు పైగానే పలికింది. కనిష్ఠ ధర రూ.2,600 ఉండగా.. మధ్యస్థ ధర రూ.3,200 కొనసాగింది. ఒక్కసారిగా క్వింటా ధర రూ.4,500 పైగా పలకటంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు ఆదివారం 742.55 క్వింటాళ్లకు పైగానే సరకు వచ్చినట్లు యార్డు అధికారులు తెలిపారు. నెలన్నర రోజుల కిందట మార్కెట్‌లో టమాటా కొనుగోళ్లు ప్రారంభమైన తర్వాత తొలిసారిగా గరిష్ఠ ధర రూ.4,500 పలకటం ఇదే తొలిసారి.

మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వ్యాయామం, మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితం పొందవచ్చని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 40 ఏళ్లు పైబడినవారు నిరంతరం గుండె పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సునీల్ సేపురి, నాగేంద్రప్రసాద్ తోట, సందీప్‌కుమార్, అరుణ, పీటర్, ఫరూక్, స్పెషల్ బ్రాంచి సీఐ ప్రసాద్, ఎస్సై మల్లికార్జున పాల్గొన్నారు.

ర్యాలీలో జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ తదితరులు

పదవీ విరమణ శుభాకాంక్షలు
శ్రీ తెలుగు మల్లయ్య గారు - శ్రీమతి తెలుగు పార్వతి గారు
Sub Jail Superintendent, నందికొట్కూరు
40 సంవత్సరాలుగా విధి నిర్వహణలో అంకితభావంతో తనదైన ప్రత్యేక శైలిలో జైలు శాఖలో వివిధ హోదాలలో పనిచేసి అందరి మన్ననలు పొంది, కుటుంబ ఉన్నతికి అహర్నిశలు కృషిచేసి నేడు పదవీ విరమణ చేయుచున్న శ్రీ తెలుగు మల్లయ్య గారికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు. వీరి తదుపరి జీవితం ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో గడపాలని కోరుకుంటూ...
అమ్మ: రంగమ్మ
అత్తమ్మ: వెంకట లక్ష్మమ్మ
కుమార్తెలు - అల్లుళ్లు
షర్మిల - ప్రవీణ్ కుమార్
సంధ్యా రాణి - విజయ కులకర్ణి
హిమ బింధు - శేఖర్
మనుమరాళ్లు మరియు మనుమడు
పర్ణిక సాయి
బ్రాహ్మణి
రెహాన్ష్
మరియు బంధుమిత్రులు

సుంకేసులకు పెరిగిన వరద

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఆదివారం ఇన్‌ఫ్లో పెరిగినట్లు జలాశయ ఇంజినీరు రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం 4,709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఆదివారం 11,337 క్యూసెక్కులకు పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో 2 గేట్లు ఎత్తి దిగువకు 8,892 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.235 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇంజినీరు పేర్కొన్నారు.

తుంగభద్రలో ఇసుక తోడేళ్లు

పంచలింగాల ప్రాంతంలో తవ్వకాలు

- యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలింపు

తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అయినా అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రజలందరికీ ఇసుక ఉచితంగా అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సి.బెళగల్ మండల పరిధిలో రీచ్‌లు ఏర్పాటుచేసింది. మిగతా ప్రాంతాల్లో తవ్వకాలు జరగకుండా ఆదేశాలిచ్చింది. అయినా కొందరు అక్రమంగా తవ్వకాలు చేస్తూ పెద్దఎత్తున తరలిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఎవరికివారు పట్టించుకోక..

కర్నూలు గ్రామీణ మండల పరిధిలోని నిడ్జూరు, మునగాలపాడు, పంచలింగాల తదితర ప్రాంతాల మీదుగా ప్రవహించే తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఏకంగా జాతీయ రహదారి వంతెన ప్రాంతంలో తవ్వేస్తుండటంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయడంలో జిల్లా గనులు, భూగర్భ, రెవెన్యూ, పోలీసు శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నిడ్జూరు, మునగాలపాడు నుంచి ప్రతిరోజూ రేయింబవళ్లు 100కుపైగా ట్రాక్టర్లలో ఇసుక తరలుతోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు పెద్దఎత్తున గండిపడుతోంది.

జేబులు నింపుకొంటూ..

పంచలింగాల వద్ద కొందరు రాత్రివేళల్లో ఇసుక డంప్ చేసి టిప్పర్లల్లో తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు చేస్తున్నప్పటికీ అక్రమ రవాణాకు అడ్డుకట్టు పడటం లేదు. తుంగభద్ర నదీ తీర ప్రాంతాలతోపాటు కర్నూలు గ్రామీణ మండల పరిధిలో ఎక్కడా తవ్వకాలకు అనుమతులు లేవు. అయినప్పటికీ కొందరు రాజకీయ నేతల పలుకుబడితో ఇసుకను కొల్లగొడుతున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్లు జాతీయ రహదారిపై యథేచ్ఛగా వెళుతున్నా తనిఖీలు శూన్యమే. కొందరు వారి నుంచి డబ్బులు వసూలు చేసి వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పడిపోతున్న భూగర్భ జలాలు

నదిలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తుండటంతో భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇలానే తవ్వకాలు జరిపితే భవిష్యత్తులో తాగునీటికీ సమస్యలు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
38 సం॥ల సుదీర్ఘ విధి నిర్వహణలో అంకితభావంతో ఆర్ & బి డిపార్ట్‌మెంట్ నందు విశిష్ట సేవలందించి పలువురి మన్ననలు పొంది, క్రమశిక్షణ, సేవాతత్పరత కలిగిన శ్రీ రాచేపల్లి నాగరాజు గారికి హార్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ... వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కొనసాగాలని భగవంతుని కోరుకుంటూ...
గౌ॥ శ్రీ రాచేపల్లి నాగరాజు గారు B.Tech.
పర్యవేక్షక ఇంజినీర్, రహదారులు మరియు భవనముల శాఖ, కర్నూలు
ఆర్ & బి డివిజన్, కర్నూలు
శ్రీ బి.సురేష్ బాబు Executive Engineer
శ్రీమతి పి.వి.భారతి, D.E.E.
శ్రీ వి.రవి చంద్ర, D.E.E.
శ్రీ ఎమ్.శివ రుద్ర, D.E.E.
ఆర్ & బి డివిజన్, నంద్యాల
శ్రీ ఎ.వి.శ్రీధర్ రెడ్డి District R&B Engineering Officer
శ్రీ కె.సుబ్బరాయుడు, D.E.E.
శ్రీ పి.ప్రసాద రెడ్డి, D.E.E.
శ్రీ సి.వి.సునీల్ రెడ్డి, D.E.E.
శ్రీ ఎన్.సురేష్ బాబు, D.E.E.
ఆర్ & బి డివిజన్, ఆదోని
శ్రీ కె.క్రిష్ణా రెడ్డి Executive Engineer
శ్రీ డి.వెంకటేశ్వర్లు, D.E.E.
శ్రీ కె.నాగరాజు D.E.E.
శ్రీ వి.నాగ వెంకటేశ్వర రెడ్డి, D.E.E.
రహదారులు మరియు భవనముల శాఖ, కార్యాలయ సిబ్బంది మరియు కాంట్రాక్టర్స్

(c) eenadu

విద్యారంగంలో సరైన నిర్ణయాలు అవసరం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విద్యారంగంలో సరైన నిర్ణయాలు ఎంతో అవసరమని క్లస్టర్ వర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్ అభిప్రాయపడ్డారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో 'ఎన్‌ఈపీ-2020' అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ ద్వారా విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలన్నారు. నూతన విద్యా విధానంపై విద్యార్థులు, ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎన్‌ఈపీ-2020 ప్రత్యామ్నాయ ప్రజా విద్యా విధానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మానవ హక్కుల ఉద్యమ నాయకుడు చంద్రశేఖర్, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అక్టోబరు 7 వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు!

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు అక్టోబరు 7 వరకు కొనసాగనున్నట్లు తెలిసింది. నూతన మద్యం ప్రకటన అమలు చేసేందుకు మరికొన్నిరోజుల సమయం పట్టనుంది. గవర్నర్ ఆమోదానికి దస్త్రం పంపిన నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అక్టోబరు 6న లక్కీడిప్ కార్యక్రమం నిర్వహించి అనుమతుల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రక్రియకు వారం రోజులు పట్టనుండటంతో మద్యం దుకాణాలు మూసివేసి వేస్తే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. దీంతో ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను 7వ తేదీ వరకు కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో 83, నంద్యాల జిల్లాలో 93 ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆ రోజు వరకు కొనసాగించనున్నారు. ఈ నెలాఖరుతో దుకాణాల్లో ఉండే సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల గడువు ముగినప్పటికీ మరో వారం వారి సేవలను వినియోగించుకోనున్నారు.

సీటీ యాంజోగ్రఫీతో నిర్ధారణ సులభం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఓపెన్ హార్ట్ సర్జరీ, వృద్ధులు వంటివారు యాంజోగ్రామ్ చేయించుకోవాలంటే భయపడతారు, దీనికి ప్రత్యామ్నాయంగా సీటీ యాంజోగ్రఫీతో కార్డియాలజీ నిర్ధారణ మరింత సులభమని స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఏక్యాంపులోని హెల్త్ క్లబ్‌లో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రపంచ హృద్రోగ దినాన్ని పురస్కరించుకున్ని వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. సాంకేతికపరంగా ఆధునిక కాలంలో రోగులకు గుండె నిర్ధారణ పరీక్షలు సీటీ యాంజోగ్రఫీ ద్వారా మెరుగైన వైద్యం అందివచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవానిప్రసాద్, డాక్టర్ తేజానందరెడ్డి, సర్వజన వైద్యశాల డీఎం పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రాజశేఖర్

మల్లన్న ప్రసాదం పరమ పవిత్రం

భక్తులకు విక్రయించే చిన్న లడ్డూలు

వడ ప్రసాదాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లిన ప్రతి భక్తుడి మనసును దోచే మహాప్రసాదం లడ్డూలు. ఉషోదయానే బాలభోగంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు రోజుకో రకమైన ప్రసాదాలు (నైవేద్యాలు) సమర్పిస్తారు. వీటిని ఆలయ ప్రాంగణంలోనే తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పిస్తారు. శ్రీశైల మహాక్షేత్రంలో నిత్యం వేకువజామునే ఆలయ ద్వారాలు తెరుస్తారు. మహా మంగళ హారతికి ముందుగా బాలభోగంలో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్లకు పలు రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉదయం 7 గంటలకు మల్లికార్జున స్వామి వారికి లడ్డూ ప్రసాదాన్ని నివేదనగా సమర్పిస్తారు. స్వామివారికి సమర్పించిన లడ్డూ ప్రసాదంలో కొంత భాగాన్ని మళ్లీ పరిచార సిబ్బంది లడ్డూ పోటుకు తీసుకొస్తారు. అక్కడ భక్తులకు విక్రయించేందుకు తయారు చేసే లడ్డూ పదార్థాల్లో దాన్ని కలిపి పవిత్రం చేస్తారు.

భక్తులకు విక్రయించే పెద్ద లడ్డూలు

ఆ రుచి అమోఘం

బాలభోగం నివేదన సమర్పణ కోసం 5 కిలోల ప్రసాదాన్ని స్వామి, అమ్మవార్లకు సమర్పిస్తారు.

☛ వేకువజామునే కాకుండా ఉదయం 11.30, రాత్రి 7.15 గంటలకు కూడా నైవేద్యాలు సమర్పిస్తారు. బాలభోగ నైవేద్యాలే కాకుండా స్వామి, అమ్మవార్ల ఆలయాల ద్వారా వేర్వేరుగా 25 కిలోల చొప్పున పులిహోరను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు.

☛ స్వామి, అమ్మవార్లకు బాలభోగం ప్రసాదాల తయారీ కోసం ఆలయ ప్రాంగణంలో వంటశాలలు వేర్వేరుగా ఉన్నాయి. స్వామివారికి వీరశైవ జంగమ వంట సిబ్బంది, అమ్మవారి ఆలయంలో బ్రాహ్మణ వంట సిబ్బంది ప్రసాదాలు తయారు చేస్తారు.

☛ భక్తజనులకు నోరూరించే లడ్డూలు

శుచీ, శుభ్రతకు పెద్దపీట

☛ ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఆలయానికి ఆగ్నేయభాగంలో ఉన్న లడ్డూ పోటులో ప్రసాదాలు తయారు చేస్తారు. లడ్డూలతో పాటు వడ, పులిహోర ప్రసాదం తయారు చేసి భక్తులకు విక్రయిస్తారు. 50 మంది దేవస్థానం సిబ్బంది, పొరుగు సేవల సిబ్బంది శుచి, శుభ్రత పాటిస్తూ ప్రసాదాలు తయారు చేస్తారు. రోజూ వేకువజామున 4.30 నుంచి ఉదయం 10.30 గంటల వరకు లడ్డూ పోటులో సిబ్బంది ప్రసాదాల తయారీలో నిమగ్నమై ఉంటారు.

☛ 100 గ్రాముల బరువు కలిగిన చిన్న లడ్డూలను రోజుకు 40 వేల నుంచి 50 వేలు, రద్దీ రోజుల్లో 60 వేల వరకు తయారు చేస్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 30 లక్షల లడ్డూలను తయారు చేస్తారు. 400 గ్రాముల లడ్డూలను రోజుకు 3- 4 వేలు తయారు చేసి భక్తులకు విక్రయిస్తారు. రోజుకు 75 నుంచి 100 కిలోల పులిహోర ప్రసాదం తయారు చేసి కొంటర్లకు అందజేస్తారు.





అమ్మవారి స్వర్ణ గోపురం

ప్రసాదాల ధరలు	
100 గ్రాముల లడ్డూ	రూ.20
400 గ్రాముల లడ్డూ	రూ.80
వడ (45 గ్రాములు)	రూ.20
పులిహోర (150)	రూ.10

కట్టుదిట్టంగా తయారీ

☛ ప్రసాదం లడ్డూల తయారీకి దిట్టంను ఉపయోగిస్తారు. ఒక్క దిట్టంతో 1035 లడ్డూలు తయారవుతాయి.

పదార్థాలు	బరువు (కిలోలు)
శనగ పిండి	25
చక్కెర	45
నెయ్యి	16
జీడిపప్పు	1.900
ఎండు ద్రాక్ష	1.750
యాలకులు	0.190
పచ్చకర్పూరం	0.030
జాజికాయ	0.040

నాణ్యత తనిఖీలు ఎక్కడ?

శ్రీశైల మహాక్షేత్రంలో లడ్డూల తయారీకి వాడే నెయ్యి, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, యాలకులు తదితర వాటి నాణ్యతపై గతంలో అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. 2022-23లో మార్కెట్ ధరల కంటే అధిక మొత్తం వ్యయం చేసి కొనుగోలు చేసిన విషయాన్ని అప్పట్లో పాలకవర్గ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి వెలుగులోకి తెచ్చారు. అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ దీనిని తెరమరుగు చేశారు. చాలా ఏళ్లుగా కొనుగోలు చేస్తున్న విజయ డెయిరీ నెయ్యిని కాదని ప్రైవేటు సంస్థ నుంచి కొనుగోలు చేసి లడ్డూల తయారీకి వినియోగించారు. తిరుమల నెయ్యి నాణ్యతపై వివాదం నేపథ్యంలో శ్రీశైలంలో వినియోగించిన నెయ్యి, ముడి సరకుల ధరలపై విచారణ చేపట్టాలన్న డిమాండ్ ఉంది. దేవస్థానం వినియోగించే నెయ్యిని గుంటూరులోని ఓ ప్రైవేటు ల్యాబ్‌లో నాణ్యత పరీక్షలు చేయిస్తున్నట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. నివేదికలు మాత్రం బహిర్గతం చేయడం లేదు.

ఆదోని ఆర్ట్స్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

దాతృత్వం చాటిన పూర్వ విద్యార్థులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఆదివారం 1980 నుంచి 1984 వరకు చదివిన పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించారు. నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను స్మరించుకున్నారు. పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో భవిష్యత్తులో సేవ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఆదోని ఆర్ట్స్ కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి, మెడల్ డెయిరీ ఎండీ పిన్నమనేని ధన ప్రకాష్ రూ. లక్ష విరాళం ఇస్తామని ప్రకటించారు. పూర్వ విద్యార్థులు కూడా మరో రూ. లక్ష కళాశాల అభివృద్ధికి విరాళం ఇవ్వాలని నిర్ణయించుకున్నామమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణమ నాయుడు, రాజేశ్వరరావు, మల్లికార్జునరెడ్డి, సురేష్, మల్లికార్జునరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ శాఖలో 39 మంది ఎస్సైలకు స్థాన చలనం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖలో 39 మంది ఎస్సైలకు స్థాన చలనం కలిగింది. ఇందుకు సంబంధించి ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సైలు శ్రీధర్‌రావు, ఇ. ఆదినారాయణమూర్తి, వెంకటరత్నం, చంద్రశేఖర్, భాస్కర్, దిలీప్ కుమార్, విజయ్‌కుమార్‌ను డిస్ట్రలరీ విభాగానికి బదిలీ చేయగా, మిలిగిన వారిని వేర్వేరు స్టేషన్లకు పంపించారు. బదిలీ అయిన ఎస్సైలు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రదేశం
ఎ. రమణారెడ్డి	పుట్టపర్తి స్టేషన్	పెద్దహరివణం చెక్‌పోస్టు
జి. మారుతీప్రసాద్	కర్నూలు స్టేషన్	కర్నూలు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
రెహనాబేగం	కర్నూలు స్టేషన్	కర్నూలు స్టేషన్
సుధసాగరరెడ్డి	అనంతపురం జిల్లా	సుంకేసుల చెక్‌పోస్టు
బాలనర్సింహారెడ్డి	ఛత్రగుడి చెక్‌పోస్టు	హాళగుంద చెక్‌పోస్టు
ప్రవీణ్ నాయక్	ఉరవకొండ	కోసిగి స్టేషన్
బి. సాయిప్రవీణ్	నంద్యాల డిస్ట్రలరీ	పత్తికొండ స్టేషన్
జె. లక్ష్మి	తిరుపతి	కోడుమూరు స్టేషన్
డి. శ్రీనివాసరెడ్డి	పెనుగొండ స్టేషన్	ఆదోని స్టేషన్
ఇంద్రకిరణ్‌తేజ	కర్నూలు ఈఎస్ టాస్క్‌ఫోర్స్	కర్నూలు ఈఎస్ టాస్క్‌ఫోర్స్
కె. దుర్గానవీన్‌బాబు	తిరుపతి జిల్లా	కర్నూలు స్టేషన్
కె. శ్రీధర్‌రావు	రాయదుర్గం	పంచలింగాల చెక్‌పోస్టు
మధుసూదన్‌రెడ్డి	అనంతపురం జిల్లా	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
మల్లికార్జునరావు	మడకశిర	పంచలింగాల చెక్‌పోస్టు
ఇస్మాయిల్	ఆదోని	ఎమ్మిగనూరు స్టేషన్
థామస్‌విన్సెంట్	పంచలింగాల చెక్‌పోస్టు	కర్నూలు ఐఎంఎల్ డిపో
చంద్రమోహన్	అనంతపురం జిల్లా	కోడుమూరు స్టేషన్
నవీన్‌కుమార్	చిత్తూరు	ఆలూరు స్టేషన్

32 మంది ఆబ్కారీ సీఐలకు విధుల కేటాయింపు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీశాఖ స్టేషన్లకు సీఐలను నియమించారు. కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సీఐ సుభాషిణి, సీఐ జయరాంనాయుడు, సీఐ కృష్ణలను నియమించారు. కర్నూలు ఐఎంఎల్ డిపోకు సీఐ పద్మావతిని, నంద్యాల ఐఎంఎల్ డిపోకు సీఐ కోటిరెడ్డి నాగిరెడ్డిని నియమించారు. కర్నూలు ఈఎస్ టాస్క్‌ఫోర్స్‌కు సీఐ రాజేంద్రప్రసాద్, నంద్యాల ఈఎస్ టాస్క్‌ఫోర్స్‌కు లక్ష్మణదాసును నియమించారు.

ఆబ్కారీ స్టేషన్	పేరు
కర్నూలు	చంద్రహాస్
ఆలూరు	లలితాదేవి
ఆదోని	జాన్‌సైదుల్
పత్తికొండ	విశ్వేశ్వరరావు
ఎమ్మిగనూరు	రమేష్‌రెడ్డి
కోడుమూరు	మంజుల
కోసిగి	పి. భార్గవరెడ్డి
నంద్యాల	జి. కృష్ణమూర్తి
ఆళ్లగడ్డ	ఎం. కృష్ణమూర్తి
కోవెలకుంట్ల	ఎండీ టక్‌తీబాషా
బనగానపల్లె	పి. వర్ధనాదేవి
డోన్	బి. వరలక్ష్మి
ఆత్మకూరు	కిశోర్‌కుమార్
నందికొట్కూరు	ఎస్. రామాంజనేయులు
చత్రగుడి చెక్‌పోస్టు	శేషాచలం, రమాదేవి
హాళగుంద చెక్‌పోస్టు	శ్రీధర్
పెద్దతుంబళం చెక్‌పోస్టు	శ్రీనివాసులు
మాధవరం చెక్‌పోస్టు	లక్ష్మణరావు, చంద్రశేఖర్‌నాయుడు
నాగలదిన్నె చెక్‌పోస్టు	నాగమణి, జహీర్‌అహ్మద్
సుంకేసుల చెక్‌పోస్టు	కిశోర్‌కుమార్
పంచలింగాల చెక్‌పోస్టు	సువర్ణలత
ఎమ్మిగనూరు మొబైల్‌పార్టీ	మొహినుద్దీన్ బాషా

మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి, పక్కన వెంకట్రామయ్య తదితరులు

1న నగరంలో మహా ర్యాలీ

కర్నూలు బి.క్యాంపు : తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో వీహెచ్‌పీ, హిందూ ధార్మిక, సామాజిక సంస్థల ఆధ్వర్యంలో నగరంలో 1వ తేదీన మహార్యాలీ నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. మఠాధిపతులు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పత్తికొండ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా సోమవారం కర్నూలులో తన బంగ్లా క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీఈవోల సంఘం కార్యవర్గ ఎన్నిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా వ్యవసాయశాఖ బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల (ఎంపీఈవోల) సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులు బసవరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మల్లేశు, మధుసూదన్‌గౌడ్, ప్రతాప్ నాయుడు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారుల సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షునిగా చిన్న అయ్యన్న, గౌరవాధ్యక్షునిగా రంగన్న, ప్రధాన కార్యదర్శిగా శివన్న, కోశాధికారి వినయ్, ఉపాధ్యక్షులుగా టి. వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అమృతవాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా మహేశ్ యాదవ్, రంగస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

అన్యమతస్థులను ఎందుకు నియమిస్తున్నారు?

✷ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

తిరుపతి, న్యూస్‌టుడే: 'తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి దేవుడంటే నమ్మకం లేదు. ఆయన సతీమణి అన్యమతస్థురాలు. మరో మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తొలి నుంచి నాస్తికుడు. భగవంతుడంటే అతనికి నమ్మకం లేదు. తితిదే వంటి ధార్మిక సంస్థలో అన్యమతస్థులను ఛైర్మన్లు, పాలకమండలి సభ్యులుగా ఎందుకు నియమిస్తున్నారు?' అని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ప్రశ్నించారు. ఆదివారం తిరుపతిలో మాట్లాడారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులను సిట్ త్వరగా తేల్చి వారికి శిక్షలు విధించాలని కోరారు. 'జగన్ నియంతలాగా వ్యవహరిస్తున్నారు. ఇంట్లో తిరుమల సెట్టింగ్, గోశాల ఉంటే సరిపోదు. మానవత్వం, దైవత్వం ఉండాలి. అవి రెండూ జగన్‌లో చిన్నతనం నుంచే లేవన్న విషయం వారి కుటుంబ సభ్యులే ఏనాడో చెప్పారు. డిక్లరేషన్‌పై సంతకం పెడితే ఏమవుతుంది జగన్?' అని ఆయన ప్రశ్నించారు.

అక్టోబరు 20న 42 మందికి సర్వే నిర్వహణ పరీక్ష

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: విజయవాడలోని ఏపీ సర్వే శిక్షణ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబరు 20న సర్వే నిర్వహణ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సీనియర్ అసిసెంట్లు, ఆర్‌ఐలకు కర్నూలు జిల్లా రెవెన్యూ శాఖలో 22 మంది, నంద్యాలలో 20 మంది కలిపి మొత్తం 42 ఎంపికయ్యారు. వీరికి విజయవాడలోని ఏపీఎస్‌టీఏలో 20వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి 1:30 గంట వరకు పరీక్ష జరగనుంది.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి విజేతలవ్వాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా రాణించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగర శివారులోని రిడ్జి పాఠశాల మైదానంలో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఉమ్మడి రాష్ట్రాల ఫుట్‌బాల్ అండర్-14, 17, 19 పోటీలను రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి. పుల్లయ్య, రవీంద్ర విద్యా సంస్థ ఛైర్మన్ మోహన్‌కుమార్, రిడ్జి పాఠశాల సీఈవో గోపినాథ్, గ్లోబల్ పాఠశాల సీఈవ జీవం వంశీధర్, పోటీల నిర్వాహక కార్యదర్శి, పాఠశాలల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్కుమల్, రవీంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. మమతామోహన్, రిడ్జి పాఠశాల సమన్వయకర్త సౌమ్యగోపినాథ్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారుల గౌరవ వందనాన్ని ఎంపీ స్వీకరించారు.

◆ అండర్-19 విభాగంలో హైదరాబాద్ డీపీఎస్ పాఠశాల, హైదరాబాద్ స్లోగ్ బిర్లా పాఠశాల తిరుపతిపై 3-1 గోల్స్‌తో విజయం సాధించింది. చిన్మయ విద్యాలయ హైదరాబాద్ జట్టు, హార్ట్‌ఫుల్‌నెస్ లర్నింగ్ సెంటర్ రంగారెడ్డి, కాకతీయ పబ్లిక్ స్కూల్ గాజువాక విశాఖ, ఇండస్ యూనివర్సల్ పాఠశాల మల్కాజ్‌గిరి హైదరాబాద్‌పై విజయంతో ముందుకు సాగుతున్నాయి.

◆ అండర్-14 విభాగంలో పూల్ ఏలో లారెన్ ఉన్నత పాఠశాల, ఈస్ట్ గోదావరిపై, సికింద్రాబాద్ దిల్లీ పబ్లిక్ స్కూల్, విజయవాడ గొల్లపూడి పాఠశాలపై 3-0 గెలుపొందాయి. పూల్ బిలో ది అధీనా పాఠశాల దిన్నెదేవరపాడు జట్టు, ది గ్లోబల్ ఎడ్జ్ ఉన్నత పాఠశాల రంగారెడ్డి 2-0 గోల్స్ విజయంతో ముందుకు సాగుతున్నాయి.

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంపీ నాగరాజు

రైలు కిందపడి కాపరి మృతి

వెల్దుర్తి,న్యూస్‌టుడే: వెల్దుర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు కింద పడి పశువుల కాపరి మస్తాన్‌వలి(74) ఆదివారం మృతి చెందారు. కృష్ణగిరికి చెందిన ఆయన వెల్దుర్తి బ్రహ్మగుండం సమీపంలో నివాసం ఉంటున్నారు. కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్తున్న వందేభారత్ రైలు వెల్దుర్తి ఈద్గా సమీపంలోని రైల్వేట్రాక్‌పై వెళ్తున్న అతన్ని ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనపై రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..

చక్కరాళ్ల(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: చక్కరాళ్ల గ్రామానికి చెందిన లోకేశ్(38) కర్నూలులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అతన్ని కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు పత్తికొండ పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి భార్య రంగలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు, లేబర్ కాలనీ, వి.ఆర్.కాలనీ,
కర్నూలు- 518003, ఫోన్ : 08518-235800, ఈమెయిల్ : rokrnl-ee1@appcb.gov.in
LiFE Lifestyle for Environment

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ రీషెడ్యూలు ప్రకటన

కర్నూలు జిల్లా, కౌతాలం మండలం, మరలి గ్రామం, సర్వేనెం.157 నందు ప్రతిపాదిత మరలి ఓపెన్ శాండ్ రీచ్-2 (తుంగభద్ర నది) పేరున 4.311 హెక్టార్ల విస్తీర్ణంలో 43,110 m3/Annum సామర్థ్యం గల సాధారణ ఇసుక మైనింగ్ కొరకు తేది:31.08.2024న ప్రతిపాదించబడిన ప్రజాభిప్రాయ సేకరణ ఇఐఏ నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించబడలేదు. ప్రస్తుతం పైనపేర్కొనబడిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన తేది: 15.10.2024న మధ్యాహ్నం 12.00 గం॥లకు కర్నూలు జిల్లా కౌతాలం మండలం, మరలి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఈ కార్యక్రమమును తిరిగి నిర్వహించబడునని తెలియజేయడమైనది. ఇ.ఐ.ఎ. ప్రకటన నెం. ఎస్.ఓ 1533, తేది: 14.09.2006 నిబంధనలకు అనుగుణంగా దిగువ తెలిపిన సంతకందారుకు తమ యొక్క అభిప్రాయాలను వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. పైన తెలిపిన తేది మరియు స్థలము నందు నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణకు యావన్మంది ప్రజానీకం పాల్గొని తమ యొక్క సలహాలు, సూచనలు, అభిప్రాయాలు మరియు ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలియజేయగలరు.

ప్రదేశం: కర్నూలు సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్,
తేది : 28.09.2024 ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కర్నూలు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు, లేబర్ కాలనీ, వి.ఆర్.కాలనీ,
కర్నూలు- 518003, ఫోన్ : 08518-235800, ఈమెయిల్ : rokrnl-ee1@appcb.gov.in
LiFE Lifestyle for Environment

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ రీషెడ్యూలు ప్రకటన

కర్నూలు జిల్లా, కౌతాలం మండలం, గుడికంబాలి గ్రామం, సర్వేనెం.286 నందు ప్రతిపాదిత గుడికంబాలి ఓపెన్ శాండ్ రీచ్ (తుంగభద్ర నది) పేరున 10.0 హెక్టార్ల విస్తీర్ణంలో 1,00,000 m3/Annum సామర్థ్యం గల సాధారణ ఇసుక మైనింగ్ కొరకు తేది:31.08.2024న ప్రతిపాదించబడినప్రజాభిప్రాయ సేకరణ ఇఐఏ నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించబడలేదు. ప్రస్తుతము పైనపేర్కొనబడిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన తేది: 15.10.2024 ఉ.11.00గం॥లకు కర్నూలు జిల్లా, కౌతాలం మండలం, గుడికంబాలి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఈ కార్యక్రమమును తిరిగి నిర్వహించబడునని తెలియజేయడమైనది. ఇ.ఐ.ఎ. ప్రకటన నెం. ఎస్.ఓ 1533, తేది: 14.09.2006 నిబంధనలకు అనుగుణంగా దిగువ తెలిపిన సంతకందారుకు తమ యొక్క అభిప్రాయాలను వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. పైన తెలిపిన తేది మరియు స్థలము నందు నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణకు యావన్మంది ప్రజానీకం పాల్గొని తమ యొక్క సలహాలు, సూచనలు, అభిప్రాయాలు మరియు ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలియజేయగలరు.

ప్రదేశం: కర్నూలు సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్,
తేది : 28.09.2024 ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కర్నూలు

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు, లేబర్ కాలనీ, వి.ఆర్.కాలనీ,
కర్నూలు- 518003, ఫోన్ : 08518-235800, ఈమెయిల్ : rokrnl-ee1@appcb.gov.in
LiFE Lifestyle for Environment

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ రీషెడ్యూలు ప్రకటన

కర్నూలు జిల్లా, కౌతాలం మండలం, నదిచాగి గ్రామం, సర్వేనెం.240 నందు ప్రతిపాదిత నదిచాగి ఓపెన్ శాండ్ రీచ్ (తుంగభద్ర నది) పేరున 9.170 హెక్టార్ల విస్తీర్ణంలో 91,700 m3/Annum సామర్థ్యం గల సాధారణ ఇసుక మైనింగ్ కొరకు తేది: 31.08.2024న ప్రతిపాదించబడిన ప్రజాభిప్రాయ సేకరణ ఇఐఏ నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించబడలేదు. ప్రస్తుతము పైన పేర్కొనబడిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన తేది: 15.10.2024న మధ్యాహ్నం 1.00 గం॥లకు కర్నూలు జిల్లా కౌతాలం మండలం, నదిచాగి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఈ కార్యక్రమమును తిరిగి నిర్వహించ బడునని తెలియజేయడమైనది. ఇ.ఐ.ఎ. ప్రకటన నెం. ఎస్.ఓ 1533, తేది: 14.09.2006 నిబంధనలకు అనుగుణంగా దిగువ తెలిపిన సంతకందారుకు తమ యొక్క అభిప్రాయాలను వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. పైన తెలిపిన తేది మరియు స్థలము నందు నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణకు యావన్మంది ప్రజానీకం పాల్గొని తమ యొక్క సలహాలు, సూచనలు, అభిప్రాయాలు మరియు ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలియజేయగలరు.

ప్రదేశం: కర్నూలు సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్,
తేది : 28.09.2024 ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కర్నూలు

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

EDUCATION
RS School of Nursing & Paramedical College. Opp: Pavan TVS Showroom, Adoni నందు GNM, DMLT & DMPHA (Male) Management Seats Available Cell: 7702894254.

REAL ESTATE
కృతిక కన్‌స్ట్రక్షన్స్ వారి నూతన వెంచర్ నందు ప్లాట్స్, 2 BHK హౌసెస్ బ్యాంక్ లోన్ వసతి కలదు. NDK రోడ్డు, కమ్మ సంఘం వెనుక 100 feet రోడ్డు ఆనుకొని. శ్రీరామ్ ✆ 99853 43829.

FLAT FOR SALE
నంద్యాల చెక్ పోస్టు దగ్గర M.R. Squere అపార్ట్‌మెంట్‌లో 2 BHK ఫ్లాట్లు అన్ని ఆధునిక వసతులతో Ready to Occupy అమ్మకంనకు కలవు. ✆ 99081 41706.

LAND FOR SALE
5-09 ఎకరాల పొలం అమ్మబడును, వెల్దుర్తి మం॥, లక్ష్మినగరం. వెల్దుర్తి నుండి 12 km మదార్‌పురం, బింగిదొడ్డి వయా లక్ష్మినగరం. ✆ 98859 53143, 91776 15123.

TO LET

COMMERCIAL
గోడౌన్స్ బాడుగకు ఇవ్వబడును. 1450 Sft కల్లూరు ఎస్టేట్, 850 Sft ఆటో నగర్ కర్నూలు నందు కలదు. సంప్ర॥ 99855 50011.

JOBS
Wanted Male Academic Principals Qualification any Degree, Age limit: 30 to 45 Years. Salary upto: 30,000/- and Female Hostel Incharges. Salary upto: 12000/- plus Food and Accommodation. Qualification any Inter/ Degree. Location: Kurnool. Contact: 92487 33342.

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ✆ 89776 39662, 89776 39663.

మా సెక్యూరిటీ హౌస్ కీపింగ్ సంస్థ నందు పనిచేయుటకు అనుభవం గల ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. మంచి జీతం + ESI, PF, TA, DA సంప్రదించండి. సెల్: 94405 94412.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల వేలం ప్రాంతంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడి మార్కెట్లో అపరిశుభ్రత మధ్యే కూరగాయల వేలాలు నిర్వహిస్తుండటంతో వ్యాపారులు, రైతులకు ఇబ్బందిగా ఉండేది. దీనిపై ఈ నెల 18వ తేదీన కథనం ప్రచురితమైంది. స్పందించిన మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి శుభ్రత పనులు చేయించి, స్వచ్ఛతగా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

రూ.10 లక్షలతో సిమెంట్ రహదారి

తుగ్గలి, న్యూస్‌టుడే: తుగ్గలిలో ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లే రహదారిలో రూ.10 లక్షలతో సిమెంట్ రహదారి పనులు జరుగుతున్నాయి. పనులను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, వరలక్ష్మి, సర్పంచి రవి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆలూరు, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక వారపు సంత సమీపంలోని కాల్వలో మురుగు ముందుకు పారకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– వీరేశ్, ఆలూరు

సమాధానం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చేత చెత్తా చెదారం తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అరుణాదేవి, సర్పంచి, ఆలూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో రహదారి పక్కన ఉన్న చెత్తా చెదారం, వ్యర్థాల కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది.

– రమేశ్, హొళగుంద

సమస్య: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రతా పనులు చేయిస్తాం. – రంగమ్మ, సర్పంచి, హొళగుంద

పల్లె కబుర్లు

దొడ్డనగేరి (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: దొడ్డనగేరిలో రహదారులు, మురుగు కాల్వల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న డిమాండు చేశారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి లీకేజీలు, విద్యుత్తు స్తంభాలు వంటి పలు సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు మునిస్వామి, రామాంజనేయులు, నాగరాజు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున ఆదివారం కోరారు. ఒప్పంద కార్మికులను తొలగించేందుకు కుట్ర జరుగుతుందని, కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.

కల్తీ చేసినవారిని భగవంతుడే శిక్షించాలి

హొళగుంద, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసినవారిని భగవంతుడే శిక్షించాలని భాజపా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ రామలింగ పేర్కొన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్‌స్వామి పిలుపు మేరకు మండలంలోని గజ్జహళ్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారతీయ గోవు ఘోష గోవిందా గోవిందా.. తిరుమల లడ్డూ గోవిందా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథఆచారి, రంగస్వామి, భీమేశ్, శేఖర్, గాదిలింగ, రాము పాల్గొన్నారు.

మాళమల్లేశ్వరునికి పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండల పరిధిలోని దేవరగట్టు కొండలో వెలసిన మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం తెల్లవారుజామునే జలాభిషేకం, తైలాభిషేకం, బండారు అర్చన, బిల్వార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, ఆకు పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గమ్యం చేరని ప్రయాణాలు

☛ అధ్వానంగా రహదారులు

☛ ఐదేళ్ల నిర్లక్ష్యం వాహనదారులకు శాపం

రహదారుల నిర్వహణను గాలికొదిలేయడం వల్ల అధ్వానంగా మారాయి. గోతులు పడి ప్రయాణం సాగించలేని దుస్థితి నెలకొంది. గమ్యం చేరాలంటే గంటల తరబడి ప్రయాణించక తప్పడం లేదు. ఆదోని, ఆలూరు నియోజకవర్గంలోని రహదారుల దుస్థితి ఇది.

గుంతలు పూడ్చండి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు శిరుగుప్ప కూడలి సమీపంలోని మాధవరం ప్రధాన రహదారిపై కంకరతేలి పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం మంత్రాలయం, కర్ణాటక రాష్ట్రానికి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చోదకులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రమాదానికి గురికావాల్సిందే. అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను మూయించి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఆ కాలనీకి వెళ్లేదెలా?

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం మండిగిరి పరిధిలోని హౌసింగ్ కాలనీ (జగనన్న కాలనీ)కి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గుంతలు పడి ఛిద్రమైంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. రోజూ వందలాది హౌసింగ్ లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలు చూసుకొనేందుకు వెళ్లలేని పరిస్థితి. రహదారి సరిగా లేక అవస్థలు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వంతెన.. ఇంతేనా!

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో వలగొండ- అల్లారుదిన్నె మధ్యలోని కుందూ వాగుపై ఉన్న పురాతన వంతెన పూర్తిగా శిథిలమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నీరు వంతెన పైభాగం వరకు ఉద్ధృతంగా ప్రవహించింది. ఈ వంతెన సుమారు వందేళ్ల కిందట ఉంటుందని స్థానిక గ్రామస్థులు తెలిపారు. ఐదేళ్లలో ఎలాంటి మరమ్మతులు చేయక పోవడంతో వంతెన పూర్తిగా శిథిలమైంది. వంతెన రక్షణ గోడ దెబ్బతింది. వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సెపక్‌తక్రా క్రీడాకారుడికి సన్మానం

ఆలూరు, న్యూస్‌టుడే: ఇటీవల చైనాలోని కింగ్‌డావోలో జరిగిన అంతర్జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో ఆలూరుకు చెందిన క్రీడాకారుడు మధు సత్తా చాటిన విషయం తెలిసిందే. క్రీడాకారుడిని ఎంపీ బస్తిపాటి నాగరాజు కర్నూలులో తన నివాసంలో ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో క్రీడాకారుడి తండ్రి బసవరాజు, కురవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు మధును సత్కరిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

వైకాపా నుంచి భాజపాలో చేరిక

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం 37వ వార్డుకు చెందిన పర్వతాపురం పరిధిలోని వైకాపాకు చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో ఆదివారం భాజపాలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీకి, ఆదోని అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డా.పార్థసారథి

అభ్యుదయ భావాల రూపం.. జాషువా

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: జాషువా సాహిత్యం, జీవితం అభ్యుదయ భావాల రూపమని వక్తలు అన్నారు. ఆదోనిలో సాహితీ స్రవంతి, అరసం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్, బల్లెకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్య, కవులు నల్లారెడ్డి, లక్ష్మన్నయాదవ్, అమలనాథన్, మహాదేవప్ప, స్వయంప్రభ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న సాహిత్య అభిమానులు

ఆలయానికి సీఐ విరాళం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని గాంధీనగర్‌లో నిర్మిస్తున్న దేవరగట్టు మాళవిమల్లేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కోసం వైఎస్ఆర్ జిల్లాలోని కడప సీఐ హేమకుమార్ రూ.80 వేల ఖర్చుతో విగ్రహం ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు లాలప్ప తెలిపారు. సీఐని కలసిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు గౌరవ శ్రీరాములు, మహేశ్, మైలర్ తదితరులు ఉన్నారు.

పెరవలి కార్యనిర్వహణాధికారిగా వీరయ్య బాధ్యతలు

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి శ్రీరంగనాథస్వామి వారి ఆలయ కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖరరెడ్డి స్థానంలో కొత్త ఈవోను నియమించారు. ఈ మేరకు ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామన్నారు.

వంట గదిలో పాఠాలు

హోలహర్వి పంచాయతీ మజరా గ్రామం మాచనూరు ప్రాథమిక పాఠశాలలో గదుల కొరత వ్యాధిస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 88 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేవలం ఒకే గది ఉంది. నాడు - నేడు కింద అదనపు గదులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ముందుగా రూ.లక్ష విడుదల చేశారు. దీంతో ముందస్తుగా విద్యార్థులు అవసరానికి అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించారు. గదులు నిర్మించేందుకు నిధులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో వంట గదినే తరగతి గదిగా మార్చుకున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే చదువుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనపు గదులు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, హాలహర్వి**

సరిపోదా శనివారం

శనివారం వచ్చిందంటే చాలు సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నం తర్వాత విధులకు డుమ్మా కొడుతున్నారు. హాలహర్వి మండల పరిధిలో గూళ్యం-2 గ్రామ సచివాలయం మధ్యాహ్నం తర్వాత సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనులు నిమిత్తం వచ్చిన స్థానికులు వెనక్కు వెళ్లిపోయారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా మూడు దఫాలుగా హాజరు వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులతో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. ఉదయం సిబ్బంది ఉన్నారని, ప్రత్యేక సమావేశం సైతం నిర్వహించామన్నారు. ఈ విషయంపై విచారణ చేస్తామని వివరించారు. **- న్యూస్‌టుడే, హాలహర్వి**

కురువల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మాదాసి, మాదారి కురువల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని పట్టణంలోని బీరప్ప దేవాలయ సమావేశ మందిరంలో ఆదివారం కురువ సంఘం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యమాన్ని గ్రామాలకు తీసుకెళ్లండి, చైతన్యం తీసుకురావాలన్నారు. అసెంబ్లీలో కురువల ఎదుర్కొంటున్న ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి ధ్రువపత్రాల జారీపై ప్రస్తావిస్తామన్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగన్న, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరాజు గౌడు, రాష్ట్ర నాయకులు సోమలింగ, జిల్లా అధ్యక్షుడు దేవేంద్రప్ప, నాయకులు మల్లికార్జున, బసవరాజు, శివరాం, కరువల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఆదోని క్రీడాకారిణి

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి సంజన రాష్ట్ర స్థాయి అండర్-15 క్రికెట్ ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైనట్లు ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టారమేశ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ముజిబ్‌అహ్మద్, కోచ్ బాలాజీ తెలిపారు. గత నెలలో నెల్లూరులో జరిగిన అంతర్ జిల్లాల బాలికల అండర్-15 క్రికెట్ మ్యాచుల్లో క్రీడాకారిణి సంజన ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 28 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక కోసం ప్రాబబుల్స్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో..

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఆదోని పట్టణంలోని అక్షరశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మేఘనాథ్‌రెడ్డి, డైరెక్టరు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అండర్-19 బాస్కెల్ బాల్ పోటీల్లో పి.అహ్మద్, అండర్-19 కబడ్డీ పోటీల్లో జి.శ్రావణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు షాషావలి, మస్తాన్‌వలీని, విద్యార్థులను అభినందించారు.

లాంగ్ జంప్, పరుగు పందెం

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరులోని జిల్లా పరిషత్తు బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని సుజాత, ఫిజికల్ డైరెక్టరు సరోజ శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన జ్యోతి లాంగ్‌జంప్, దేవి 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

షాట్‌పుట్‌లో.. : ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు ఆదర్శ పాఠశాల విద్యార్థిని విశ్వతేజు షాట్‌పుట్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాఘవరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్న తెలిపారు.

క్రికెట్ పోటీలకు మద్దికెర విద్యార్థి

మద్దికెర, న్యూస్‌టుడే: అండర్ 19 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మద్దికెర విద్యార్థి ఎంపికయ్యాడు. స్థానిక విద్యాసాయి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కాలువ యువరాజు కర్నూలులో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని కళాశాల నిర్వాహకులు వెంకటమాధవ్, పీఈటీ విజయభాస్కర్ తెలిపారు. మచిలీపట్నంలో అక్టోబర్ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని వారు తెలిపారు.

యువరాజు

రాష్ట్రస్థాయికి ఎంపిక

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతి బాపులే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ 17 పరుగులో భార్గవి, అర్చన 800 మీటర్ల పరుగులో మాధురి, షాట్‌పుట్‌లో అంకితరాణి అనే విద్యార్థులు ప్రతిభ చూపారు. దీంతో వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపల్ షబానాబేగం తెలిపారు.

ఆర్.ఎస్.పెండేకల్లు విద్యార్థులు..

ఆర్ఎస్ పెండేకల్లు(తుగ్గలి), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆర్ఎస్ పెండేకల్లు విద్యార్థులు దీపిక, రాజేష్ ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు పాండురంగ తెలిపారు. ఇటీవల కర్నూలు నగరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ సెలక్షన్ పోటీలలో పాల్గొని ఇద్దరు అండర్ 17 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రప్రసాద్, పీఎంసీ ఛైర్మన్ అమీనాబేగం, గ్రామస్థులు అభినందించారు.

మీనాక్షి కుటుంబంతోనే తెదేపా నష్టం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వారి కుటుంబం వల్లే తెదేపాకు నష్టం వాటిల్లుతోందని భాజపా జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక భీమాస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందటున్న మీనాక్షినాయుడు.. పార్టీలోనే ఐదు వర్గాలు ఎందుకు ఏర్పడ్డాయని ప్రశ్నించారు. 60- 40 రాజకీయాలకు అలవాటు పడి పార్టీని నిలువునా ముంచి, వరుసగా రెండు సార్లు ఓడిపోయారన్నారు. ఒక్క మీ కుటుంబం తప్పా, పార్టీలో ఏ ఒక్క నాయకుడు, కార్యకర్త బాగుపడిన దాఖలాలు లేవన్నారు. కూటమిపై నమ్మకం, స్థానిక ప్రజలు గట్టి మార్పు కోరుకుని ఇక్కడ భాజపాను గెలిపించారన్నారు. కనీసం తెదేపాలో మీనాక్షినాయుడుతో పాటు వారి కుటుంబానికి ఎలాంటి హోదా లేవని, అలాంటప్పుడు ఎమ్మెల్యేను, భాజపాను విమర్శించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, నాయకులు దేశాయి చంద్రన్న, రత్నబాయి, గోపి, నాగార్జున, సుశీలా, సాయి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు తప్పిపోయిన ఏడ్చుకుంటూ ఉండగా.. గుర్తించిన స్థానికులు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలోని ఖాజీపుర ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ కుమారులు సోహెల్, ఇస్మాయిల్‌గా గుర్తించారు. వారి తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించుకొని ఇద్దరు బాలలను అప్పగించారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇద్దరు చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

☛ పోలీసుల నిఘా పెంచుతాం ☛ పత్తికొండ డీఎస్పీ బోయగ్గ వెంకట్రామయ్య

ఇంటర్వ్యూ

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని పత్తికొండ డీఎస్పీ బోయగడ్డ వెంకట్రామయ్య హెచ్చరించారు. పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జనజీవానికి ఆటంకాలు లేకుండా చూసేందుకు ఆయా పరిధిలోని స్టేషన్ల పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో పనిచేస్తూ ఇటీవల పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని స్టేషన్లకు బదిలీపై వచ్చిన సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉంటున్నాయన్నారు. డీఎస్పీ 'న్యూస్‌టుడే'తో పలు విషయాలు వివరించారు.

బి.వెంకట్రామయ్య, పత్తికొండ డీఎస్పీ

మద్యం, నాటుసారాపై..

నాటుసారా తయారీ, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లోని కొందరు అక్కడ చౌకగా లభ్యమయ్యే టెట్రా ప్యాకెట్లను తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం ధరలు తగ్గనున్న నేపథ్యంలో ఇక ఇతర ప్రాంతాల నుంచి అక్రమ మద్యం తరలింపు ఉండదు.

రహదారి ప్రమాదాలపై దృష్టి

మైనర్లు వాహనాలు నడపడం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయటం వల్ల రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. చిన్న పిల్లలు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు, వాటి యజమానులపై సైతం కేసులు నమోదు చేస్తాం. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వీలైనంత వరకు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రతలు తీసుకోవాలి.

మత్తు వదిలిస్తాం

పత్తికొండ పట్టణంలో కొందరు యువకులు గంజాయి వాడుతున్నారనే సమాచారం మేరకు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాం. వారిలో ఇద్దరు మైనర్ బాలురు ఉన్నారు. వారిచ్చిన సమాచారం మేరకు ఆస్పరి మండలం కౌరుప్పలలో ఓ రైతు తన పొలంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను పట్టుకొని అతనిపై కేసు నమోదు చేశాం. ఇటీవల మూడు రోజుల కిందట ఎస్పీ ఆదేశాల మేరకు సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బందితో కలిసి పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోని దుకాణాల్లోనూ, టీ హోటళ్లలోనూ తనిఖీలు నిర్వహించాం. గంజాయి వినియోగించినా, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం.

జూదంపై ఉక్కుపాదం

కొందరు మట్కా, జూదం ఆడుతూ పెడదారులు పడుతున్నారు. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. పత్తికొండ ప్రాంతంలో మట్కా కనుమరుగైంది. ఎక్కడైనా ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారం వస్తే.. వారిపై కఠినంగా వ్యవహరించి భవిష్యత్తులో వాటి జోలికి వెళ్లకుండా చర్యలు చేపడతాం.

చోరీలకు అడ్డుకట్ట

రెండు నెలల కిందట పత్తికొండ, ఆస్పరి, ఆలూరు ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఇళ్లలో, ఆలయాల్లో జరిగిన చోరీల్లో కొంత మంది నిందితులను పట్టుకున్నాం. ఇటీవల ఆలూరులో చోరీకి గురైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి బాధితులకు అందజేశాం. పత్తికొండ పట్టణంలో జరిగిన చోరీలపైనా తమ సిబ్బంది పూర్తి స్థాయిలో దొంగలను పట్టుకునేందుకు కృషి చేస్తున్నాం. ఈ మేరకు సీఐలు, ఎస్సైలు తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచుతాం. నిరంతర నిఘా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

సీసీ కెమెరాల ఏర్పాటు

పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఆయా వ్యాపార దుకాణ యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారికి అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును పరిశీలిస్తాం. కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజల ఆస్తులకు రక్షణతో పాటు నేరాల అదుపుకు పోలీసులకు కొంత మేర సహకారం ఉంటుంది.

పాత నేరస్థులపై..

గతంలో నేరాలకు పాల్పడి వివిధ కేసుల్లో నిందులుగా ముద్రపడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. వారి కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి వారు తిరిగి నేరాలవైపు వెళ్లకుండా నిరోధిస్తాం.

నేడు పురపాలక కౌన్సిల్ సమావేశం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పురపాలక ఛైర్‌పర్సన్ శాంత తెలిపారు. కౌన్సిల్‌లో పురపాలక అజెండా అంశాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.



పదవీ విరమణ శుభాకాంక్షలు
విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు కృషి చేసి నేడు పదవీ విరమణ చేయుచున్న మా నాన్న శ్రీ టి.వెంకట కృష్ణుడు గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ టి.వెంకట కృష్ణుడు గారు, VRO
హాలహర్వి (మం.)
శ్రీమతి టి.కళావతి గారు
కుమార్తెలు - అల్లుళ్లు, మనుమరాళ్లు - మనుమళ్లు
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

శ్రీమఠంలో సిద్ధారూడ మఠం పీఠాధిపతులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్రస్వామి దర్శనార్థం సిద్ధారూడ మఠం పీఠాధిపతులు డాక్టర్ శివకుమార్ స్వామీజీ, సిద్ధారూడ మఠం కలబుర్గి మాతాశ్రీ లక్ష్మీదేవితాయి తదితరులు ఆదివారం మంత్రాలయం వచ్చారు. మఠం చేరుకున్న వారికి మఠం అధికారులు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు వారిని సత్కరించారు. శ్రీమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పీఠాధిపతి వారికి వివరించారు. మఠం సహాయ మేనేజర్ నరసింహామూర్తి, సహాయ పీఆర్వో బిందుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠం పీఠాధిపతితో సిద్ధారూడ మఠం పీఠాధిపతులు

శ్రీమఠంలో ద్వాదశి పూజలు

విశేష అలంకరణలో బృందావనం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ద్వాదశి పురస్కరించుకుని శ్రీమఠంలో పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున బృందావనానికి నిర్మాల్యం, పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు, నవరత్న కవచాలు, విశేష పూలతో అలంకరించారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజ మందిరంలో జయ దిగ్విజయ, మూల రాములకు, బ్రహ్మకరచిత నరసింహాస్వామి ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, గ్రామ దేవత మంచాలమ్మకు, రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు బంగారు పల్లకి సేవ, చెక్క, వెండి అంబారి, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఉంచిన ప్రహ్లాదరాయలకు పీఠాధిపతి హారతి ఇచ్చారు. అనంతరం శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు.

ఎమ్మిగనూరులో భారీ వర్షం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు వర్షం కురవడంతో కల్లా వద్ద దిగుబడులు ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వేరుశనగ క్వింటా రూ.7,129

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్లో ఆదివారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ. 7,129, మధ్యస్థం రూ. 6,290, కనిష్ఠం రూ. 2,900కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 7,820 వేరుశనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ. 5,830, మధ్యస్థం రూ. 5,810, కనిష్ఠం రూ. 4,850 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

సి.బెళగల్, న్యూస్‌టుడే: **సమస్య:** ముడుమాల గ్రామం పునరావాసా కాలనీలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేయాలి.
–గ్రామస్థులు, ముడుమాల

సమాధానం: నిధులు మంజూరు కాగానే సమస్యను పరిష్కరిస్తాం. –కర్రెన్న, డీఈఈ, కోడుమూరు

శుద్ధ జల కేంద్రం.. నిర్వహణ శూన్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: శుద్ధ జల కేంద్రంలో ఇసుక, గులక రాళ్లు, యంత్రాలు, ఇతర నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించారు. నీరు శుద్ధి కాక పోవడంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పట్టణంలో కలుషిత జలం సరఫరాతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. దశాబ్దాల కిందట నిర్మించిన ఫిల్టర్ బెడ్లకు నిధులు కేటాయించకపోవడంతో పట్టణ ప్రజలకు శుద్ధ నీటి కోసం కష్టాలు నెలకొన్నాయి.

పట్టణ జనాభా: 1.23 లక్షలు
శుద్ధజల కేంద్రాలు: 2
ప్రతి రోజూ సరఫరా: 12 ఎంఎల్‌డీ
కుళాయిలు: 14,900
ఇళ్లు: 22,600

20 ఏళ్లుగా మార్చలేదు

పట్టణ ప్రజల కోసం శుద్ధ జలాన్ని అందించాలన్న లక్ష్యంతో గుడేకల్లు రహదారిలో రెండు ఫిల్టర్ బెడ్లను నిర్మించారు. ఒక్కో కేంద్రంలో దాదాపు 7 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసేందుకు అవకాశం ఉంది. ఫిల్టర్ బెడ్లలో ఇసుకను ఐదేళ్లకోసారి మార్చాలి. కానీ దాదాపు 20 ఏళ్లుగా మార్చకపోవడంతో నీరు శుద్ధి కావడం లేదు. నిత్యం కార్మికులు నాలుగు సార్లు ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేసినా శుద్ధి కావడం లేదు. గులక రాళ్లు, చిన్న కంకర, ఇసుక సక్రమంగా పని చేయక నీరంతా ఒండ్రు మట్టి వస్తున్నాయి. శుద్ధి చేసిన నీటిని క్విబుల్లా కాలనీ, పురపాలక సంఘం కార్యాలయంలో పంప్ హౌస్ ద్వారా నీటిని ట్యాంకులకు ఎక్కించాలి.

పని చేయని క్లోరినేషన్ సూచించే యంత్రం

పని చేయని యంత్రాలు

శుద్ధజల కేంద్రంలో ఇసుక, కంకర, గులక రాళ్లు లేని పరిస్థితి. ఆరు బెడ్లను మార్చాలి. ఒండ్రు మట్టి వస్తే వాటిని అరికట్టేందుకు ఆలం యంత్రాల ద్వారా శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు పని చేయడం లేదు. క్లోరినేషన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డులు విరిగిపోవడంతో నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు. విద్యుత్తు మోటార్ల కోసం ఏర్పాటు చేసిన బోర్డులన్నీ విరిగిపోయాయి. ప్రొటెక్టర్ ఉన్నా పని చేయదు. లోపల ఉన్న మోటార్లు, ఇతర యంత్రాలు మరమ్మతులు లేక పోవడంతో మూలన పడ్డాయి. ఆలం తొట్లు ఆరు ఉన్నా, అవి పని చేయడం లేదు. క్లోరినేషన్ యంత్రాలు విరిగిపోయాయి.

కలుషిత నీరు సరఫరా

నీటిని నేరుగా ట్యాంకులకు సరఫరా చేయడంతో ఒండ్రు మట్టితో ఎరుపు రంగులో సరఫరా అవుతున్నాయి. ఈ నీటిని తాగడంతో వాంతులు విరేచనాలు, టైఫాయిడ్ వంటి తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఫిల్టర్ బెడ్డులో ఉన్న నీటి శుద్ధి కేంద్రం

తాగునీటి సరఫరా చేయని కాలనీలు

వెంకటాపురం, లక్ష్మణ్ టాకీస్ ఏరియా, అబ్బాస్ టాకీస్, సోమప్పనగర్, చంద్ర కొట్టాల, క్విబుల్లా కాలనీ, రాఘవేంద్ర, సోమప్పనగర్, ఇతర కాలనీల్లో నీరు సరఫరా కావడం లేదు.

ప్రతిపాదనలు పంపాం. –గంగిరెడ్డి, పురపాలక కమిషనర్ ఎమ్మిగనూరు

గుడేకల్లు ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. ఫిల్టర్లు ఉన్నా ఇసుక ఇతర వాటిని మార్చాలి. లోపల బోర్డులు, శుద్ధ జల కేంద్రానికి ఉన్న అన్నీ మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తాం.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కె.ఐశ్వర్య

చనుగొండ్ల (గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: చనుగొండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె. ఐశ్వర్య రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో శనివారం జరిగిన అండర్ 17 బాలికల రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆదివారం చెప్పారు. త్వరలో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూల్ సాహెబ్ అభినందించారు.

మిరప సాగుపై రైతులకు అవగాహన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పిల్లిగుండ్లలో అపార్డు, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిరప సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించినట్లు ఆ సంస్థ సభ్యుడు భాస్కర్ తెలిపారు. ఆదివారం గ్రామంలో రైతులతో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిరపలో రసాయనిక మందులు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రైతులకు వేపనూనె, గ్రీన్‌రిచ్ మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

కార్యాలయాలకు పేర్లు పెట్టండి

కోడుమూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలోని సచివాలయాలను గుర్తించాలంటే ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఏది ఎక్కడ ఉందంటూ ఆవరణలో ఉన్నవారిని అడగడం నిత్యకృత్యమైంది. ఆవరణలో ఎదురెదురుగా 4వ, 5వ సచివాలయాలున్నాయి. ప్రవేశ ద్వారంపైన పేర్లు రాయకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. అధికారులు సైతం దీనిపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం.
– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

కుంట కాదు.. కాలనీకెళ్లే దారి

పెద్దకడబూరులోని దళితవాడలో అంబేడ్కర్ విగ్రహ సమీప కాలనీలో మురుగు రహదారిపైకి రావడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వ్యాపిస్తున్నాయని స్థానికుడు అంజినయ్య వాపోయారు. ఎగువ నుంచి వచ్చే వృథా నీరంతా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందన్నారు. కొద్ది నెలలుగా సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా పరిష్కారం చూపాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పెద్దకడబూరు

నియంత్రిక చుట్టూ మొక్కలు.. తొలగించకపోతే ఇక్కట్లు

కోసిగి బీసీ వసతి గృహం పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు లేదా నియంత్రికలో ఏదైనా సమస్య తలెత్తి మరమ్మతులు చేయాలంటే కష్టంగా ఉంటుంది. ఫలితంగా గంటల కొద్ది విద్యుత్తు నిలిచిపోయి ఇబ్బంది పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కోసిగి

రహదారిపై శునకాలు.. వాహనదారులకు వణుకు

కౌతాళం మండలం హాల్వి గ్రామంలో వీధి కుక్కలు ప్రధాన రహదారిపై గుంపులుగా చేరి ద్విచక్ర వాహనదారులను, కాలినడకన వెళ్లే వారిని వెంబడించి దాడి చేస్తున్నాయి. దీంతో వారు భయాందోళనలకు గురవుతున్నారు. హాల్వి బైపాస్ రహదారిలో 4 నుంచి 5 చోట్ల కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహనదారులు భయపడుతున్నారు. హాల్వి గ్రామంలో సుమారు 10 వేలకుపైగా జనాభా ఉంది. గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు ఉన్నాయని చాలా వాటికి రోగాలు వ్యాపించాయని స్థానికులు తెలుపుతున్నారు. పంచాయతీ వారు స్పందించి వీధి కుక్కలను గ్రామం నుంచి దూర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం(కౌతాళం)

అందుబాటులో లేని వైద్యులు.. అందని సేవలు

గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి పెద్ద భవనాలు, నలుగురు వైద్యులు ఉచిత వైద్య సేవలు అందించాలి. కానీ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందడం లేదు. వారం రోజుల కిందట మండలంలోని చిన్నమర్రివీడు, వేముగోడు, కైరవాడి గ్రామాల్లో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. పుట్టపాశం గ్రామంలో రెండు అనుమానిత డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం నెల రోజులుగా మండలంలోని ప్రతి పల్లెలో జనం జ్వరాలతో అల్లాడుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే వైద్యులు ఎవరూ లేకపోవడంతో వారి పరిస్థితి వర్ణానాతీతంగా ఉంది. ఆదివారం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ తీవ్ర జ్వరంతో బాధ పడుతూ ఆసుపత్రికి రాగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది మాత్రలు ఇచ్చి పంపించారు. వైద్యులు లేకపోవడంతో కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి రూ. వేలు ఖర్చు చేసి వైద్యం పొందాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

బురద తొలగించండి

గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రతగా ఉంచాలని స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో బురాన్‌దొడ్డి ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో రహదారి మార్గం పూర్తిగా బురదమయంగా మారింది. పైగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బురదమయమైన రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, బురాన్‌దొడ్డి (సి.బెళగల్)

రోడ్డుపై వర్షపు నీరు

సూగురులోని కొత్త కాలనీలో రోడ్లు లేక పోవడంతో వర్షం కురిసినప్పుడు నీరు ప్రవహిస్తూ బురదమయంగా మారుతుంది. కాలనీ ప్రారంభమై 20 ఏళ్లు అవుతుంది. ఇక్కడ దాదాపు 50 కుటుంబాలకు పైగా నిసిస్తున్నారు. అధికారంలోకి వస్తే రోడ్లు, కాలువలు నిర్మిస్తామని ప్రజలను మభ్య పెట్టి ఓట్లు వేయించుకున్న నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్త చేశారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలో దారిపై వర్షపు నీరు పారుతూ గంతలు ఉన్న చోట నీరు నిల్వ ఉన్నాయి. దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీ వాసుల భయపడుతున్నారు.
–మంత్రాలయం, న్యూస్‌టుడే

పల్లె కబుర్లు

సి.బెళగల్, న్యూసుటుడే: పోలకల్: గ్రామంలో శైవ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సి.బెళగల్: గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మిథున్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని వైద్యాధికారి ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సి.బెళగల్: సి.బెళగల్ తహసీల్దారు శ్రీనివాసులు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే బాధితులు వినతులు ఇచ్చి పరిష్కరించుకోవాలని ఉప తహసీల్దారు పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల వినతులను పరిష్కరించాలని పేర్కొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్ఐసీ ఏజెంట్ యూనియన్ కార్యదర్శిగా జయన్న ఎన్నిక కావటంతో ఆయనను యూత్ రిక్రియేషన్ క్లబ్‌లో సత్కరించారు. కోడుమూరు అభివృద్ధి కమిటీ వ్యవస్థాపకుడు కృష్ణయ్య, గౌరవాధ్యక్షుడు రాముడు, అధ్యక్షుడు షాకీర్‌లు శాలువ, పూలమాలలు వేసి సత్కరించారు.

జగన్‌పై చర్యలు తీసుకోవాలి

సి.బెళగల్, న్యూసుటుడే: తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యిని వినియోగించి అపవిత్రం చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెదేపా సి. బెళగల్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు బి. చంద్రశేఖర్ కోరారు. సి. బెళగల్‌లో ఆదివారం ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆలయాల్లో వైకాపా నాయకులు ప్రత్యేక పూజలు చేస్తున్నారని విమర్శించారు. తెదేపా మండల నాయకులు ధనుంజయ, బాలాజీ, వెంకటప్ప, కర్రెన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా నాయకులు

మృతికి సంతాపం

బురాన్‌దొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు బి. వెంకటేశ్వరరెడ్డి(74) అనారోగ్యంతో మృతి చెందారు. బురాన్‌దొడ్డి గ్రామం నుంచి ఎంపీటీసీ సభ్యునిగా ఎన్నికై గ్రామానికి సేవలందించారు. వ్యవసాయ పరపతి సంఘం సంచాలకులుగా నీటియ సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. కోడుమూరు ఎమ్మెల్యే బి. దస్తగిరి వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెదేపా మండల మాజీ కన్వీనరు బి. చిన్న తిమ్మప్ప, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి. చంద్రశేఖర్ ధనుంజయ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఫలితాలు అందేనా?

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబరు నుంచి రబీ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో భూసార పరీక్షలు ఫలితాలు రైతులకు అందుతాయో లేదో అన్న సందేహం తలెత్తుతోంది. వైకాపా గత ఐదేళ్ల పాలనలో భూసార పరీక్షలను పట్టించుకోక ఫలితాలు అందక రైతులు ఎరువుల వినియోగంలో సమతుల్యత లోపించింది. దీంతో ఎరువుల వినియోగం పెరిగి పంట వ్యయం భారమవుతోంది.

జిల్లాలో రబీలో 1.21 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగ వ్యయం తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు. జిల్లాలో సేకరించిన మట్టి నమూనాలను ముగతి భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షిస్తున్నారు. భూసార పరీక్షల కోసం 2023-24కు గాను 10,252 మట్టి పరీక్ష నమూనాలు సేకరించగా 2024-25 సంవత్సరానికి 19,500 మట్టి నమూనాలు సేకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లుగా సేకరించిన 29,752 మట్టి నమూనాలు పరీక్ష కోసం రూ. 6.70 లక్షలు విడుదల చేసింది. ఇప్పటి వరకు 11,449 మట్టి నమూనాలు పరీక్షలు పూర్తి చేశారు. రబీ సీజన్ మరికొద్ది రోజుల్లో ఆరంభమవుతున్న నేపథ్యంలో సేకరించిన మట్టి నమూనాల పరీక్షలు పూర్తి చేసి సకాలంలో అందేనా అనే సందేహం రైతులు వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల కోసం సేకరించిన మట్టి నమూనాలను పరిశీలిస్తున్న ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ

సిబ్బంది కొరత

ఎమ్మిగనూరు ఏడీఏను భూసార పరీక్ష కేంద్రం ఇన్‌ఛార్జి ఏడీఏగా నియమించారు. ముగ్గురు ఏవోలు, ఐదుగురు ఏఈవోలు, ఇద్దరు ఎంపీఈవోలు ప్రస్తుతం పని చేస్తున్నారు. మట్టి పరీక్షల ఫలితాలను ప్రస్తుతం ఉన్న ఏవోలు సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియ చేస్తున్నారు. సిబ్బంది కొరతతో మట్టి పరీక్షలు ఆలస్యమయ్యేలా ఉంది. మరో ఐదుగురు ఏఈవోలను నియమిస్తే పనులు వేగవంతమై సకాలంలో రైతులకు భూసార పరీక్ష కార్డులు అందించే అవకాశం ఉంటుంది.

రబీకి అందజేస్తాం –ఎస్.మహమ్మద్ ఖాద్రీ, భూసార పరీక్ష కేంద్రం, ఇన్‌ఛార్జి ఏడీఏ

జిల్లాలో సేకరించిన మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పూర్తి చేసిన మట్టి పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. సేకరించిన మట్టి నమూనాల పరీక్షలు పూర్తి చేసి రబీకి ఫలితాలను రైతులకు అందజేసేందుకు కృషి చేస్తాం.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఒప్పంద కార్మిక సంఘం నాయకుడు రమేష్ అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరులో సీఐటీయూ ఒప్పంద కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఒప్పంద ఉద్యోగులుగా పని చేస్తున్నామని ప్రభుత్వాలు కనీసం స్పందించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇస్తున్నారు తప్ప చేసిందేమి లేదన్నారు. కూటమి నాయకులు సమస్యలపై స్పందించాలన్నారు. సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం కింద క్రమబద్ధీకరించి తీర్పు ఇచ్చిందన్నారు. ఆసుపత్రిలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు, కార్మికులకు పది నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాముడు, సురేష్, దొరబాబు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కార్మికులను తొలగించడం దారుణం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమలో 4,290 మంది ఒప్పంద కార్మికులను తొలగించడం దారుణమని ఏఐటీయూసీ నాయకుడు తిమ్మగురుడు అన్నారు. ఆదివారం సోమప్ప కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమను కాపాడుతామని హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు గేట్ పాసులు వెనుక తీసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా స్టీల్ ప్లాంట్‌లో రిటైర్ అవుతున్న వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదన్నారు. ఉద్యోగాల సంఖ్య తగ్గుతున్న క్రమంలో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వేలాది మంది జీవనోపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు ఎల్లప్ప, సుంకన్న, విజయ్, శేఖర్, రవి, ఖలీల్, విజయ్, సుంకన్న, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమప్ప కూడలిలో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చేతి వృత్తులకు పెద్దపీట వేయాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చేతి వృత్తి రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కోడుమూరులోని ప్రైవేటు భవనంలో చేతి వృత్తిదారుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. అనంతరం చేతి వృత్తిదారుల జిల్లా నూతన అధ్యక్షుడిగా రాజశేఖర్‌ను, రజక సంఘ ఉపాధ్యక్షుడిగా రామాంజనేయులు, గొర్రెల సంఘానికి రంగప్ప తదితరులను ఎన్నుకున్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మాధవస్వామి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాథ్, సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ, రాజులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కంటి చూపు పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రతి ఒక్కరూ ఆకు కూరలు అధికంగా తీసుకోవాలని డాక్టర్ నాగ వంశీకృష్ణ సూచించారు. ఆదివారం బనవాసి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చరవాణులు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. మెరుగైన చూపు కోసం క్యారెట్, ఆకుకూరలు, గుడ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదన్‌రాజు, పాఠశాల ఛైర్మన్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో సీపీఎం మహాసభలు

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలో నవంబరులో సీపీఎం మండల మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు మల్లయ్య, వీరేష్ తెలిపారు. కౌతాళంలో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మాణం, తుంగభద్ర నదిపై వరద కాల్వను నిర్మించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండు చేశారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

రెండు మండలాల్లో వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో రెండు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు మంత్రాలయంలో 12.4 మి.మీ., తుగ్గలిలో 3.6 మి.మీ. కురిసింది. రెండు మండలాల్లో 16.0 మి.మీ. వర్షం కురవగా, జిల్లా సగటున 0.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. కాగా ఇప్పటి వరకు 89.4 మి.మీ. రికార్డయ్యింది. సాధారణంతో పోలిస్తే 23 శాతం లోటు వర్షపాతం ఉంది.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత దేవాలయ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి ప్రకటించారు. సమితి అధ్యక్షుడిగా సందడి మహేశ్వర్, కార్యధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్వీ. నారాయణరెడ్డి, వసుంధరమ్మ, కార్యదర్శి అయోధ్య శ్రీనివాసరెడ్డి, సహా కార్యదర్శులు టి.ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, రామసుబ్బమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

అమ్మవారి దర్శనానికి వచ్చిన నూతన కార్యవర్గ సభ్యులు

మెప్మాలో బదిలీలు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: మెప్మా సిబ్బందిని బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎంఎం జి. మురళీ నంద్యాలకు, నంద్యాలలో పని చేస్తున్న సీఎంఎం జి.విజయభాస్కర్‌రెడ్డి కర్నూలుకు బదిలీ అయ్యారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లు, నగర పాలక పరిధిలోని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, **సమస్య:** టెలికాంనగర్‌లో టీసీఎన్3 విద్యుత్తు స్తంభానికి వీధి దీపం వెలగకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

సమస్య: వీకర్ సెక్షన్ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. **- మురళీ, స్థానికుడు**

సమాధానం: సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. **- నగరపాలక అధికారులు**

సినీరంగంలో ఎన్టీఆర్.. ఏఎన్ఆర్‌లకు ప్రత్యేక గుర్తింపు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: చలన చిత్ర పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లకు ప్రత్యేక గుర్తింపు ఉందని, తెలుగు ప్రజలు ఎప్పుడు మరిచిపోరని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎన్టీ నాయక్ అన్నారు. కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. తెలుగు సినీరంగంలో ఎన్నో చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించిన ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాలకు చెందిన ఎనిమిది మందిని సన్మానించారు. అలాగే కళా క్షేత్రంలో 'రాత' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. వాతావరణ కాలుష్యంపై తొమ్మిదో తరగతి బాలిక చేసిన అభినయం ఆకట్టుకుంది. నాటక దర్శకులు శ్రీనివాసరావుకు ఉప కులపతి నాయక్, పత్తి ఓబులయ్య తదితరులు రూ.20 వేల పారితోషికం అందజేశారు.

సన్మానం పొందిన వారితో ఉప కులపతి నాయక్

రూ.కోట్లు కాజేసి.. బదిలీపై జారుకుని

☛ ఐదేళ్లలో ఇంజినీరింగ్ విభాగంలో అక్రమాలు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో భారీగా అక్రమాలు జరిగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు, అధికారులు కుమ్మక్కై నిధులు దోచేశారు. ఏ పని చేసినా అడిగేవారు లేకపోవడంతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారు. ఏఈ నుంచి ఈఈ స్థాయి వరకు నిధులను పక్కదారి పట్టించారు. ప్రస్తుతం బదిలీ కావడంతో కర్నూలు నగర పాలక నుంచి వేరే పురపాలికలు, నగర పాలక సంస్థలకు వెళ్లారు. రూ.కోట్లలో నిధులను మింగేసినా ఎటువంటి విచారణ చేపట్టి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పలువురు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

పైపుల నిధులు రూ.4 కోట్లు మాయం

తుంగభద్ర పుష్కరాల సమయంలో నదిలో మురుగు కలవకుండా దూర ప్రాంతానికి తరలించే పేరుతో రూ.4 కోట్లు వెచ్చించి హెచ్‌డీ పైపులు కొనుగోలు చేశారు. నగర పాలక ఇంజినీరింగ్ విభాగంలో పలువురు అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగాయి. పుష్కరాలు ముగిసిన తర్వాత పైపులను పంప్‌హౌస్‌లో భద్రపరచాల్సి ఉంది. ఇంజినీరింగ్ విభాగ ఉన్నతాధికారికి సమాచారం ఇచ్చి స్టాక్ రిజిస్టర్‌లో వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి. అలా కాకుండా వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యానవనంలో పైపులు నిల్వ చేశారు. అగ్ని ప్రమాదంలో అవన్నీ కాలిపోయాయి. ఈ పైపుల విలువ రూ.28 లక్షలుగా అధికారులు అప్పట్లో వెల్లడించారు. మరి రూ.4 కోట్లతో కొనుగోలు చేసిన పైపులు ఏమయ్యాయన్నది ఎవరికీ తెలియదు. విచారణ చేపట్టాలని పాలకవర్గ సమావేశంలో కార్పొరేటర్లు నిలదీయగా, అప్పటి కమిషనర్ భార్గవ్‌తేజ విచారణకు ఓ కమిటీ వేశారు. అయితే సమగ్ర విచారణ జరగలేదు. నగర పాలకలో పని చేసిన ఓ సీనియర్ అధికారి ఇటీవల బదిలీ అయ్యారు. అయితే పైపుల కుంభకోణానికి సంబంధించి విచారణ నివేదికలు తప్పుగా ఇచ్చారనే ఆరోపణలున్నాయి.

వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో కాలిపోతున్న పైపులు (పాతచిత్రం)

వాటర్ వర్క్స్‌లో భారీగా అవినీతి

కర్నూలు నగర పాలక హెడ్ వాటర్ వర్క్స్‌లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయి. ఓ డీఈ, ఏఈ కలిసి నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ డీఈ, నగర ప్రజాప్రతినిధి ఒకే సామాజిక వర్గం కావడంతో ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేశారు. అయితే ఏటా రూ.10 కోట్లతో హెడ్ వాటర్ వర్క్స్‌లో నిర్వహణ, క్లోరినేషన్, పైపుల లీకేజీలకు మరమ్మతులు, కొనుగోళ్లు తదితర పనులు చేస్తారు. చాలా పనులు చేయకుండా పైపులు, ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేయకుండానే బిల్లులు పెట్టి నిధులు కాజేశారని సమాచారం. దీంతోపాటు నగరంలో రూ.4 కోట్లతో మ్యాగ్నెటిక్ ఫ్లోమీటర్లు అమర్చారు. మునగాలపాడు సమీపంలో నగర పాలకకు సంబంధించిన 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్వహణకు రెండుసార్లు రూ.1.64 కోట్లు ఖర్చు చేశారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో రూ.66 లక్షలతో ఫిల్టర్ మీడియా, క్లారీ ఫ్లోక్యులేటర్‌కు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు ఖర్చు చేశారు. అయితే ఈ పనులన్నీ ఓ డీఈ, ఏఈ కలిసి ఒకే సంస్థకు అప్పగించారు. దీనిపై పలువురు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. నగరంలో పలు కాలనీల్లో అక్రమంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా జొహరాపురం రోడ్డులోనే 50కి పైగా కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు బదిలీ అయ్యారు.

షరీన్‌నగర్‌లో వాటర్ ట్యాంకుకు అమర్చిన మ్యాగ్నెటిక్ ఫ్లోమీటర్

అధికారులే గుత్తేదారులు

నగర పాలక ఇంజినీరింగ్ విభాగంలో కొందరు అధికారులే గుత్తేదారుల అవతారమెత్తారు. గత ఐదేళ్ల కాలంలో కొంత మందిని అడ్డం పెట్టుకొని దర్జాగా పనులు చేశారు. ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్, డీఈ, ఏఈ కలిసి నగరంలో పలు చోట్ల పనులు చేశారు. చేయని పనులకు సైతం బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సుమారు రూ.6 కోట్ల వరకు వేరే వారి పేర్ల మీద టెండర్లు వేసి పనులు చేసినట్లు నగర పాలకలో చర్చనీయాంశమైంది.

ముఖ్యమంత్రి భద్రతకు పటిష్ట ఏర్పాట్లు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 1వ తేదీన కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఎస్పీ ఆదివారం ఓర్వకల్లు విమానాశ్రయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు బందోబస్తు, తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ప్రోటోకాల్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట ఆర్డీవో శేషిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసచారి, తహసీల్దారు విద్యాసాగర్, ఎయిర్‌పోర్టు, ఇంటెలిజెన్స్ అధికారులు ఉన్నారు.

ఓర్వకల్లు విమానాశ్రయాన్ని సందర్శించిన ఎస్పీ బిందుమాధవ్, అధికారులు

చంద్రబాబుపై నిందలు వేయడం జగన్ అవివేకం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: డిక్లరేషన్‌పై సంతకం చేయడం ఇష్టం లేని జగన్ తిరుపతి పర్యటన రద్దు చేసుకుని చంద్రబాబు అడ్డంకులు సృష్టించారని నిందలు వేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. హిందూ మతం, దేశం గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. 11 సీట్లకే పరిమితమైన జగన్ వ్యవహరిస్తున్న తీరుతో ఈసారి ప్రజలు ఒక సీటు కూడా ఇవ్వకుండా రాష్ట్ర బహిష్కరణ చేస్తారన్నారు.

వెలుగుతున్న దీపాలు.. వృథాగా నిధులు

కర్నూలు నగరంలో కొన్నేళ్ల కిందట ఆగస్టు 15 సందర్భంగా విద్యుత్తు స్తంభాలకు రోప్ లైట్లు అమర్చారు. ఇందుకోసం రూ.లక్షలు నిధులను వెచ్చించారు. ఆ తర్వాత వీటిని తొలగించలేదు. ప్రస్తుతం నగరంలో కొన్నిచోట్ల అవి తొలగిపోయాయి. మరి కొన్నిచోట్ల అలానే ఉన్నాయి. దీంతో నగర పాలకకు విద్యుత్తు భారం ఖర్చు పెరుగుతోంది. నగర పాలక అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా నిధులు వృథాగా మారుతున్నాయని ప్రజలు అనుకుంటున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు నగర పాలక సంస్థ

నెల రోజులకే తారుమారు

నగరంలోని ఎల్కూరు బంగ్లా నుంచి ఆటోనగర్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారులపై గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల కిందట నగర పాలక యంత్రాంగం ఆ గుంతలకు తారుతో ప్యాచ్ వర్కు చేసినా అప్పుడే మళ్లీ గుంతలు యథావిధిగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన పనులు చేపట్టాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

నగరంలోని విష్ణు టౌన్‌షిప్‌లో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. అడుగుకో గుంత ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. సంతోష్‌నగర్ కొత్త ఈద్గా నుంచి విష్ణు టౌన్‌షిప్, ఎల్కూరు బంగ్లాకు వెళ్లే మార్గాల్లో సుమారు పది గుంతలు కనిపిస్తున్నాయి. ఆ గుంతలను తారుతో ప్యాచ్ వర్క్ చేయించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అన్ని రంగాల్లో రాణించగలుగుతారని సీఐడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ హాల్‌లో జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలను క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యదర్శి లోకేశ్, ఆర్గనైజర్ కార్యదర్శి వేణుగోపాల్, ఉప కార్యదర్శి రేష్మ, మహేశ్, షేక్షావతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపొందిన క్రీడాకారులతో అతిథులు

బాస్కెట్‌బాల్ టోర్నమెంటు ప్రారంభం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్ఏ మైదానంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంటును ఎస్సై నాగభూషణం ప్రారంభించారు. రెండు రోజులపాటు సాగే ఈ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు దాదాబాషా, నీలిమా, ముస్తాహీర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని బీక్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడా సంఘం ప్రతినిధి రామాంజనేయులు, హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ, క్రీడా సంఘాల ప్రతినిధులు చిన్న సుంకన్న, మహబూబ్ సుబాని పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు ప్రముఖుల సలహాలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వీరశైవులు ఓబీసీ రిజర్వేషన్ ఎలా సాధించుకోవాలో ప్రముఖుల నుంచి సలహాలు తీసుకుంటున్నామని వీరశైవ లింగాయత్/బలిజ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామకూర వీరప్ప తెలిపారు. నగరంలోని నగరూరి రాఘవేంద్ర మినీ బ్లాంకెట్ హాలులో ఆదివారం రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్, నాయకులు మంజునాథ్, చంద్రరాజు, వీరభద్రప్ప, విజయ్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చామకూర వీరప్ప

ఆరోగ్యకర జీవనశైలితో గుండె జబ్బులు దూరం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె జబ్బులు దూరం చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ హృద్రోగ దినాన్ని పురస్కరించుకుని హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గుండె జబ్బులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాదికి స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్‌కు ఉత్తమ వైద్యుడిగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్, డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, డాక్టర్ పోతన పాల్గొన్నారు.

డాక్టర్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఎంపీ నాగరాజు, హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్

యువతలో గుండె జబ్బులు పెరుగుతున్నాయని, శారీరక శ్రమ లేకపోవడం, ఒకేచోట కూర్చుని పని చేయడం, ఊబకాయం, మద్యం అలవాటు ప్రధాన కారణాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు.

కర్నూలు ఏవోగా మధుమతికి పూర్తి అదనపు బాధ్యతలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు మండల వ్యవసాయాధికారిణిగా మధుమతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం ఎమ్మిగనూరు భూసార పరీక్షా కేంద్రం ఏవోగా పని చేస్తూ డిప్యూటేషన్‌పై జిల్లా వ్యవసాయ శాఖలోని ఆత్మ విభాగం ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు ఏవోగా పని చేస్తున్న విశ్వనాథ్ రిలీవ్ అయ్యారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో రిపోర్టు చేసుకోనున్నారు. త్వరలో విజిలెన్స్ ఏవోగా జిల్లాకు రానున్నట్లు సమాచారం.

మద్యానికి దూరంగా ఉండాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: నిత్యం వ్యాయామం, యోగా, ధ్యానం చేయడంతోపాటు మద్యానికి దూరంగా ఉంటూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుంటే గుండె జబ్బులకు దూరంగా ఉంటామని మెడికవర్ ఆసుపత్రి కార్డియాలజీ వైద్యులు ప్రవీణ్, చైతన్య, తేజానందరెడ్డి అన్నారు. ఆదివారం మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ హృదయ దినాన్ని పురస్కరించుకుని క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, వైద్యుల ఆధ్వర్యంలో కేకు కోసి సంబరాలు చేసుకున్నారు.

కేకు కోస్తున్న వైద్యులు

రెండు మండలాల్లో వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో రెండు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు మంత్రాలయంలో 12.4 మి.మీ., తుగ్గలిలో 3.6 మి.మీ. కురిసింది. రెండు మండలాల్లో 16.0 మి.మీ. వర్షం కురవగా, జిల్లా సగటున 0.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. కాగా ఇప్పటి వరకు 89.4 మి.మీ. రికార్డయ్యింది. సాధారణంతో పోలిస్తే 23 శాతం లోటు వర్షపాతం ఉంది.

బాధితుల హర్షం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో 2002 డీఎస్సీ కాంట్రాక్ట్ పారామెడికల్ నోటిఫికేషన్ ద్వారా బోగస్ పత్రాలతో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు పొందిన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో అందజేసిన పత్రాలపై సమగ్ర విచారణ చేయడంతో పాటు బోగస్ పత్రాలను తొలగించాలని ఏపీ పారామెడికల్ బోర్డును లోకాయుక్త సంస్థ ఆదేశించినట్లు సమాచారం. దీనిపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు అక్టోబరు 25వ తేదీకి వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

చెత్త నిర్వహణ

కల్లూరు పట్టణం 29వ వార్డు వెంకటేశ్వరనగర్‌లో రహదారులపైనే చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. సకాలంలో వ్యర్థాలను తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వాటి నుంచి వెదజల్లుతున్న దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణ, తొలగింపు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణం

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పాతనగరం ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుష్పరాజ్, కుమార్, విజయకుమార్ పాల్గొన్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలను తగ్గించాలని సీపీఎం పాతనగరం నగర కార్యదర్శి రాజశేఖర్, షరీఫ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థినులు, మహిళలు రక్షణ కల్పించుకోవాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా సమన్వయకర్త నిర్మలమ్మ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకొని స్థానిక బాలికల వసతి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

బరిలోకి దిగితే బంగారు పతకాలు

☛ తైక్వాండోలో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: సీబీఎస్ఈ దక్షిణ మండలం తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పతకాలే లక్ష్యంగా మరింత సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుంటున్నారు. కర్నూలు నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తైక్వాండోలో రాణిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారు.

జాతీయ పోటీలకు సాధన: ఎన్.యశ్వంత్‌రెడ్డి

నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మాది అనంతపురం జిల్లా నీలరెడ్డిపల్లి గ్రామం. సెప్టెంబరు 9 నుంచి 13 వరకు తమిళనాడు రాష్ట్రంలోని శివగంగ జిల్లా కరాయికుండిలోని చెట్టినాడు పబ్లిక్ పాఠశాల మైదానంలో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండలం తైక్వాండో పోటీల్లో 59 కిలోల విభాగంలో బంగారు పతకం అందుకున్నాను. 2023 నవంబరు 14 నుంచి 15 వరకు గుంటూరు జిల్లా రేపల్లెలో అసోసియేషన్ రాష్ట్ర స్థాయి 59 కిలోల విభాగంలో స్వర్ణం గెలిచాను. 2024 జులై 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో 59 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. అలాగే జులై 27 నుంచి 30 వరకు న్యూదిల్లీలో జరిగిన జాతీయ పోటీల్లో కాంస్య పతకం అందుకున్నా. ఆగస్టు 16 నుంచి 18 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించా. అదే రాష్ట్రంలో అక్టోబరు 9 నుంచి 13 వరకు జరుగనున్న జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నాను.

ప్రతిరోజూ సాధన: ఎస్.ప్రణయ

నేను పదో తరగతి చదువుతున్నాను. కర్నూలులోని చాణిక్యపురిలో ఉంటున్నాం. సెప్టెంబరు 9 నుంచి 13 వరకు తమిళనాడు రాష్ట్రంలోని శివగంగ జిల్లా కరాయికుండిలోని చెట్టినాడు పబ్లిక్ పాఠశాల మైదానంలో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండలం తైక్వాండో పోటీల్లో 51 కిలోల విభాగంలో బంగారు పతకం అందుకున్నాను. 2022 సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 2 వరకు నెల్లూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో 51 కిలోల విభాగంలో వెండి పతకం సాధించాను. 2023 అక్టోబరు 14 నుంచి 16 వరకు చెన్నైలో జరిగిన పోటీల్లో దక్షిణ మండలం పోటీల్లో 54 కిలోల విభాగంలో బంగారు పతకం అందుకున్నాను. అదే ఏడాది నవంబరు 23 నుంచి 26 వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో జరిగిన జాతీయ పోటీల్లో 55 కిలోల విభాగంలో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాను. 2024 జులై 19 నుంచి 20 వరకు గుంటూరు జిల్లా రేపల్లెలో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించాను. ఇదే ఏడాది ఆగస్టు 16 నుంచి 18 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని కన్పూర్‌లో జాతీయ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొన్నాను. 2024 అక్టోబరు 10 నుంచి 13 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పతకం సాధించే లక్ష్యంగా ప్రతిరోజూ సుందర్ మాస్టర్ వద్ద సాధన చేస్తున్నాను.

జాతీయ కాంస్య పతక విజేతకు సన్మానం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: చైనా దేశంలోని కింగ్‌డావోలో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన ఆసియా బీచ్ సెపక్‌తక్రాలో పురుషుల భారత జట్టు కాంస్య పతకం సాధించింది. జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కర్నూలు జిల్లాకు చెందిన కురువ మధును ఆదివారం జిల్లా కురువ సంఘం నాయకులు పెద్దపాడు సమీపంలోని బీరప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో సన్మానించి రూ.5 వేలు, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు శివన్న, మాజీ అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, కోశాధికారి కేసీ నాగన్న, పాల సుంకన్న, జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలీల, అనిత పాల్గొన్నారు.

కురువ మధును సన్మానిస్తున్న జిల్లా కురువ సంఘం నాయకులు

ఆస్తి కోసం హత్యాయత్నం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని బుధవారపేటకు చెందిన నర్సప్పపై హత్యాయత్నం జరిగింది. ఈ నెల 23న రాత్రి కుటుంబ సభ్యులే ఆయనపై కత్తితో దాడి తీవ్రంగా గాయపర్చగా తన బావమరిది కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తనపై దాడి చేసి బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని నర్సప్ప భార్య శివరాణి ఆరోపించారు. ఆస్తి వివాదం నేపథ్యంలో తన భర్తపై హత్యాయత్నం చేశారని, వారి నుంచి ప్రాణహాని ఉందని ఆమె పేర్కొన్నారు.

మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శనీయమని జామియా ఖమరుల్ ఖుదా వ్యవస్థాపకుడు సయ్యద్ ముబషిర్ పాషా ఖాద్రీ పేర్కొన్నారు. నగరంలోని అశోక్‌నగర్‌లోని గుల్షన్ ఏ ఖమర్‌లో ఆదివారం నిర్వహించిన జియారత్ ఏ ముబారక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సయ్యద్ షా ముక్రమ్ పాషా ఖాద్రీ, సయ్యద్ నూరుల్లా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ ముబషిర్ పాషా ఖాద్రీ

పదవీ విరమణ శుభాకాంక్షలు
సౌమ్యులు, కార్యదీక్షాపరులు, వృత్తినే దైవంగా భావించి అంకిత భావంతో వివిధ హోదాలలో సుదీర్ఘ సేవలు అందించి అందరి మన్ననలకు పాత్రులై నేడు 30-09-2024 పదవీ విరమణ చేస్తున్న
శ్రీ నాగయ్య గారికి
ఇవే మా హృదయ పూర్వక శుభాకాంక్షలు మీరు, మీ కుటుంబసభ్యులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ...
శ్రీ M. నాగయ్య
Dy CSO/ Sig & Tele, SCR, Secunderabad
JNTU Anantapur
Bahujan Alumni Association